# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

అమరావతి
బుధవారం
18-09-2024
వెల. రూ.5
• సంపుటి : 8 • సంచిక: 267
పేజీలు : 8

Amaravathi | Tirupathi | Kurnool | Eluru | Visakhapatnam | Ananthapuramu | Kadapa | Hyderabad | Karimnagar | Nizamabad | Nallagonda | Mahaboobnagar | Warangal | Khammam




## మోదీ@74

74వ వసంతంలోకి అడుగు పెట్టిన ప్రధాని నరేంద్ర మోదీ

రూ.2800 కోట్లతో రైల్వే ప్రాజెక్టులు

ఒడిశాలో 'సుభద్రయోజన' ప్రారంభం

26 లక్షల అవాస్ యోజన ఇండ్లు ఆవిష్కరణ

ఆవాస్ యోజన ఇంటిలో పుట్టినరోజు జరుపుకున్న ప్రధాని మోదీ

ప్రధాని మోదీకి జన్మదిన శుభాకాంక్షలు

రాష్ట్రపతి, అమిత్ షా, రాహుల్ గాంధీ, ఖర్గే, తెలుగు రాష్ట్రాల సీఎంలు, బీజేపీ నేతలు, సినీ ప్రముఖులు

7



## సీఎం పదవికి కేజ్రీవాల్ రాజీనామా

ఢిల్లీ కొత్త సీఎంగా అతిశి

ఏకగ్రీవంగా ఎన్నిక చేసిన ఆప్

ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా అరవింద్ కేజ్రీవాల్

7



## దేశంలో అభివృద్ధి పరుగులు

మోడీ రాకతో రాజకీయ స్థిరత్వం

రైలు ప్రమాదాల వెనక కుట్రలు కనిపెడతాం

మోడీ వందరోజుల పాలనపై బుక్‌లెట్ విడుదల

హోంమంత్రి అమిత్ షా వెల్లడి

7

# మునిగిన ఇంటికి రూ.25 వేలు!

## నేటి నుంచే పరిహారం.. ఖాతాలకు సొమ్ము

### ఫస్ట్ ఫ్లోర్, ఆపై ఉన్న ఫ్లోర్లకు రూ.10 వేలు

బైకులకు 3 వేలు.. ఆటోలకు రూ.పది వేలు

షాపులకు 50 వేల నుంచి 1.50 లక్షల వరకు


బాధితులకు బ్యాంకు నుంచి కొత్త రుణాలు

పంట నష్టానికి ఎకరానికి రూ.10-14 వేలు

అద్దెకు ఉండేవారికీ, కౌలుదార్లకే పరిహారం

గేదెలు, ఆవులు చనిపోతే రూ.50 వేలు

చరిత్రలో ఇంత భారీ పరిహారం ఇప్పుడే: సీఎం



**అమరావతి, సెప్టెంబరు 17(మనం న్యూస్) :** కనీవినీ ఎరుగని వరదల తాకిడికి తీవ్రంగా నష్టపోయిన విజయవాడ నగర వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ పరిహార ప్యాకేజీని ప్రకటించింది. మంగళవారం రాత్రి సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్యాకేజీ వివరాలను వెల్లడించారు. బుధవారం నుంచే నష్ట పరిహారం పంపిణీ ప్రారంభమవుతుందని, వీలైనంతవరకూ రెండు మూడు రోజుల్లోనే బాధితుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని తెలిపారు. దీని ప్రకారం...వరదల్లో మునిగిన ఇళ్లలో గ్రౌండ్ ఫ్లోర్లో ఉన్నవారికి ప్రతి కుటుంబానికి రూ. పాతికవేలు ఇస్తారు. ఆ పై అంతస్థుల్లో ఉన్నవారికి వారు పడిన ఇబ్బందులకు... పని పోయినందుకు పరిహారంగా ప్రతి కుటుంబానికి రూ. పది వేలు అందిస్తారు. పరిహారం ఇళ్లలో ఎవరు ఉంటే వారికే ఇస్తామని, అద్దెకు ఉండేవారు ఉంటే వారికే వస్తుందని ముఖ్యమంత్రి విస్పష్టంగా ప్రకటించారు. విజయవాడ నగరం, దానిని ఆనుకొని ఉన్న - మిగతా 2లో...



# బీసీ కార్పొరేషన్ పునర్వ్యవస్థీకరణ

కమ్యూనిటీలవారీగా అభివృద్ధి ప్రణాళికలు

బీసీ సంక్షేమ శాఖపై సమీక్షలో నిర్ణయం

'డైట్' బకాయిలకు మోక్షం

రూ.110 కోట్ల విడుదలకు ఆమోదం

కాస్మొటిక్ చార్జీల బకాయిలు కూడా..

ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం పునరుద్ధరణ

ప్రీ, పోస్టు మెట్రిక్ స్కాలర్షిప్పులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాల విడుదల

బీసీ స్టడీ సర్కిళ్ల బలోపేతానికి 10 కోట్లు

బీసీ రక్షణ చట్టం రూపకల్పనకు సీఎం ఆదేశం

**అమరావతి, సెప్టెంబరు 17 (మనం న్యూస్) :** బీసీ కార్పొరేషన్‌ను పునర్వ్యవస్థీకరించాలని టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. కమ్యూనిటీలవారీగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించ నుంది. బీసీ ఉపకులాలవారు ఎక్కడెక్కడ నివసిస్తున్నారు.. వారి వృత్తులు, తలసరి ఆదాయం వంటి వివరాలపై ఆరా తీసేందుకు - మిగతా 2లో...

# ఎట్టకేలకు ఒక బోటు బయటికి..

ఇరుక్కున్న బోటును కదిలించిన 'కావడి' వ్యూహం

బ్యారేజీ గేటు నుంచి పున్నమి ఘాట్ వైపునకు తరలింపు

నేడు మరో రెండు బోట్ల ఆపరేషన్ ప్రారంభం



**విజయవాడ, సెప్టెంబరు 17 (మనం న్యూస్) :** 'కావడి' పని చేసింది! నీటిలో మునిగిపోయిన ఒక బోటును కదిలించింది!! పది రోజులకు పైగా ఇంజనీరింగ్ నిపుణులు, రిగ్గర్లు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ప్రకాశం బ్యారేజ్ గేట్లకు వెనుక భాగాన ఇరుక్కుపోయిన మూడు బోట్లలో ఒక బోటును ఇంజనీర్లు ఎట్టకేలకు బయటకు లాక్కొచ్చారు. ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన బోట్ల ఆపరేషన్ మంగళవారం రాత్రి ఫలితాన్నిచ్చింది. ఒక బోటును ఒడ్డుకు చేర్చడానికి 11 రోజులపాటు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. భారీ క్రేన్లు ఉపయోగించినా కదలని - మిగతా 2లో...

# అక్టోబర్ 1 నుంచి కొత్త మద్యం పాలసీ

కొత్త మద్య విధానంపై కమిటీ కసరత్తు

వివిధ రాష్ట్రాల పాలసీల వివరాలు సేకరణ

సీఎం చంద్రబాబుతో చర్చించిన కేబినేట్ కమిటీ

గతంలో జె బ్రాండ్‌తో రాష్ట్ర ఆదాయం దోపిడీ

నేడు కేబినేట్ ముందుకు మద్యం విధానం

వివరాలు వెల్లడించిన మంత్రుల కమిటీ



**అమరావతి, సెప్టెంబర్ 17 (మనం న్యూస్):** రాష్ట్రంలో అక్టోబర్ 1 నుంచి ఏపీలో కొత్త మద్యం విధానం అమల్లోకి రానుంది. కొత్త మద్యం విధానంపై కీలక విషయాలను మంత్రి వర్గ ఉపసంఘం మీడియా సమావేశంలో - మిగతా 2లో...




## బుల్డోజర్ చర్యలను ఆపండి

అక్టోబర్ 1 వరకు ఆస్తులు కూల్చొద్దు

సుప్రీం ధర్మాసనం సీరియస్ వార్నింగ్

వివరాలు 7లో



## వివేకా హత్య కేసును కొలిక్కితేండి

సీఎం చంద్రబాబును కోరిన వైఎస్ సునీత

2

సీఐడీ విచారణ ద్వారా వాస్తవాలు బయటకు..

వైఎస్ సునీత విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు

# యాగీ తుపాను విధ్వంసం

భారీ వర్షాలతో మయన్మార్ అతలాకుతలం


దాదాపు 226 మంది మృతి.. మరో 77 మంది గల్లంతు

7



# పునరుత్పాదక విద్యుత్‌కు ప్రోత్సాహం

గాంధీనగర్ సదస్సులో మంత్రి గొట్టిపాటి




**గాంధీనగర్/ అమరావతి, సెప్టెంబర్ 17 (మనం న్యూస్):** ఏపీలో పునరుత్పాదక విద్యుత్ ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ కోతలు లేకుండా నిరంత రాయంగా విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా తాము పని చేస్తున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తాము కీలక లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు తెలిపారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను అందుకునే దిశగా సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులను - మిగతా 2లో...

# గూగుల్ టేకౌట్‌తో గుట్టు రట్టు



జెత్వానీ కేసులో తాడేపల్లి కుట్ర బద్దలు

ముంబై నటిపై వేధింపులకు అక్కడే స్కెచ్

వేర్వేరుగా ముంబైకి పోలీసులు, విద్యాసాగర్

ఆమెను పోలీసులకు చూపించింది అతడే

ఆ ముగ్గురు ఐపీఎస్‌లకు బిగుస్తున్న ఉచ్చు

విద్యాసాగర్‌పై లుక్ అవుట్ నోటీస్ యోచన

జెత్వానీ కేసులో ఎవరినీ వదలం: హోంమంత్రి అనిత

వివరాలు 2లో..

## పునరుత్పాదక విద్యుత్‌కు ప్రోత్సాహం

మొదటి పేజీతరువాయి...

ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. దీనితో పాటు విద్యుత్ స్టోరేజి సాంకేతికత కూడా వినియోగిస్తామన్నారు. ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ గుజరాత్‌లోని గాంధీనగర్‌లో 'రెన్యువబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ మీట్2024'లో పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులతో చర్చించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలు, మానవ వనరుల గురించి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం 3.0 సంస్కరణలను అమలు చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా విద్యుత్ స్టోరేజి విధానంపై ప్రధానంగా దృష్టి పెట్టామని చెప్పారు. విద్యుత్ స్టోరేజికి ఆంధ్రప్రదేశ్ ను కేరాఫ్ అడ్రెస్‌గా నిలిపే లక్ష్యంతో తాము పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ను ఎనర్జీ క్యాపిటల్‌గా గుర్తింపు తీసుకొస్తామన్నారు. దీనికోసం పెద్ద ఎత్తున బ్యాటరీ స్టోరేజి విధానం, పంప్డ్ హైడ్రో స్టోరేజి, ఇతర అభివృద్ధి చెందిన విద్యుత్ స్టోరేజి సాంకేతికతను వినియోగిస్తామని చెప్పారు. రూఫ్‌టాప్ సోలార్, డీ సెంట్రలైజ్డ్ మైక్రో గ్రిడ్ల ఏర్పాటుతో విద్యుత్ ఉత్పత్తిని ప్రజలకు మరింత చేరువ చేసి, క్షేత్రస్థాయిలో ఇంధన భద్రత పెంచుతామని వివరించారు.

## ఆంధ్ర క్రికెట్ అభివృద్ధికి తొలి అడుగు

- భారత మాజీ క్రికెటర్ రాబిన్ సింగ్‌తో ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు చర్చలు



**మధురవాడ, సెప్టెంబరు 17 (మనం న్యూస్) :** ఆంధ్ర క్రికెట్ అభివృద్ధికి తొలి అడుగు పడింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో యువ క్రికెటర్లు, మహిళా క్రికెటర్లను ప్రోత్సహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై భారత మాజీ క్రికెటర్ రాబిన్ సింగ్‌తో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి సానా సతీష్ బాబు చర్చించారు. విశాఖలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో మంగళవారం ఏసీఏ కార్యదర్శి సానా సతీష్‌తో పాటు అపెక్స్ కౌన్సిల్ సభ్యులు రాబిన్ సింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రలో రాబోయే రోజుల్లో క్రికెట్ అభివృద్ధిపై ప్రధానంగా మాట్లాడారు. క్రికెట్ అభివృద్ధికి సంబంధించి రాబిన్ సింగ్‌తో అపెక్స్ కౌన్సిల్ సభ్యులు చర్చించటం పట్ల సీనియర్ క్రికెటర్లు హర్షం వ్యక్తం చేశారు.

## వివేకా హత్య కేసును కొలిక్కి తేండి

- సీఎం చంద్రబాబును కోరిన సునీత

**అమరావతి, సెప్టెంబర్ 17 (మనం న్యూస్):** మాజీ మంత్రి వైఎస్ వివేకానందా రెడ్డి హత్య కేసును సీఐడీచే విచారణ జరిపించాలని వివేకా కూతురు వైఎస్ సునీత ఏపీ సీఎం చంద్రబాబును కోరారు. మంగళవారం సునీత దంపతులు విజయవాడలో చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ వివేకా హత్య కేసు, వైసీపీ నేతల ప్రమేయం, పోలీసుల విచారణ తదితర అంశాలను ఆమె సీఎంకు వివరించారు. వివేకా హత్యకేసులో నిజాలు రాబట్టాలని కోరారు. వివేకా పీఏ కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు.. అప్పటి సీబీఐ ఎస్పీ రాంసింగ్‌తో పాటు తమపై అక్రమ కేసు పెట్టారని సీఎం దృష్టికి తెచ్చారు. కృష్ణారెడ్డి ఫిర్యాదులో నిజానిజాలపై విచారణ చేయించాలని కోరారు. రాంసింగ్‌పై కేసు వంటి అంశాలపై విచారణ చేయించాలని విజ్ఞప్తి చేశారు. సీఐడీ విచారణ ద్వారా వాస్తవాలు బయటకు తేవాలని కోరారు. సునీత విజ్ఞప్తిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. తనకు అన్ని విషయాలు తెలుసని.. విచారణ చేయిస్తానని హామీ ఇచ్చారు.

# మునిగిన ఇంటికి రూ.25 వేలు!

మొదటి పేజీతరువాయి...

గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 172 వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో ఈ ప్యాకేజీ వర్తిస్తుంది. షాపులు, ఇతర వాణిజ్య సంస్థలకు వాటిల్లిన నష్టం ఎక్కువగా ఉండటంతో వాటికి వేరే ప్యాకేజీ ప్రకటించారు. చిన్న కిరాణా షాపులు, టీ కొట్లకు రూ.పాతిక వేలు, వ్యాపారం కింద నమోదై రూ.నలభై లక్షల లోపు టర్నోవర్ ఉన్న వాణిజ్య సంస్థలకు రూ.ఏభై వేలు, రూ.నలభై లక్షల నుంచి రూ.కోటిన్నర వరకూ టర్నోవర్ ఉన్న షాపులకు రూ.లక్ష, అంతకు పైన టర్నోవర్ ఉన్న వాణిజ్య సంస్థలకు రూ. లక్షన్నర పరిహారంగా ఇస్తారు. ద్విచక్ర వాహనాల రిపేర్లకు రూ. మూడు వేలు ఇస్తారు. ఆటోలకు రూ. పది వేలు ఇస్తారు. తోపుడు బళ్ళు పోయినా... దెబ్బతిన్నా ప్రభుత్వం వాటిని ఉచితంగా సమకూరుస్తుంది. చేనేత పనివారి మగ్గం పూర్తిగా పోతే రూ.పాతిక వేలు ఇస్తారు. గేదెలు, ఆవులు చనిపోతే రూ.ఏభై వేలు ఇస్తారు. ఎద్దులు చనిపోతే ఒక్కోదానికి రూ. నలభై వేలు అందిస్తారు. పశువుల కొట్టం పోతే రూ. ఏడున్నర వేలు ఇస్తారు. ఇల్లు పూర్తిగా పోతే కొత్త ఇల్లు ఇస్తారు.

### పంట నష్ట పరిహారం ఇలా...

పంట నష్టం కింద కొన్ని పంటలకు ఎకరానికి రూ. పది వేలు, కొన్ని వాణిజ్య పంటలకు రూ. 14 వేలు చంద్రబాబు ప్రకటించారు. ఆ వివరాలు.. దెబ్బతిన్న హెక్టారు పత్తి-రూ.25 వేలు, వేరుశెనగ-25 వేలు, వరి-25 వేలు, చెరుకు-25 వేలు, సజ్జ-15 వేలు, మినుము-15 వేలు, పెసర-15 వేలు, మొక్కజొన్న-15 వేలు, రాగి-15 వేలు, కంది-15 వేలు, నువ్వులు-15 వేలు, సోయాబీన్-15 వేలు, సన్ఫ్లవర్-15 వేలు, పొగాకు-15 వేలు, ఆముదం-15 వేలు, జ్యూట్-15 వేలు, కొర్ర-15 వేలు, సామ-15 వేలు. అలాగే, ఉద్యాన పంటలకు పరిహారం అందిస్తామని తెలిపారు. ఆ వివరాలు.. వరద దెబ్బకు గురైన హెక్టారు అరటి పంటకు-రూ.35 వేలు, పసుపు-35 వేలు, కూరగాయలు-25 వేలు, తమలపాకు-75 వేలు, మిర్చి-35 వేలు, బొప్పాయి-25 వేలు, టమాటా-25 వేలు, జామ-35 వేలు, పూలు-55 వేలు, ఉల్లి-25 వేలు, నిమ్మ-35 వేలు, మామిడి-35 వేలు, పుచ్చకాయ-25 వేలు, నర్సరీలు-25 వేలు, దానిమ్మ-35 వేలు, యాపిల్ బేర్-35 వేలు, సపోటా-35 వేలు, కొత్తిమేర-25 వేలు, జీడి మామిడి-35 వేలు, డ్రాగన్ ఫ్రూట్-35 వేలు, ఆయిల్పామ్(మొక్కకు)-రూ.1,500, కొబ్బరి (మొక్కకు)-1,500.

### కొత్త రుణాలు

వరదల్లో ఇళ్లు మునిగిపోయిన గ్రౌండ్ ఫ్లోర్ బాధితులకు రూ.ఏభై వేల రుణం బ్యాంకుల నుంచి ఇప్పిస్తామని, మూడు నెలల మారిటోరియం ఉంటుందని... 36 నెలల వాయిదాల్లో దానిని తీర్చాల్సి ఉంటుందని చంద్రబాబు తెలిపారు. షాపులకు ఇప్పటికే ఉన్న రుణాలను రీ షెడ్యూల్ చేసి ఏడాది మారిటోరియంతో కొత్త రుణాలు ఇప్పిస్తామని, వ్యవసాయానికి స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు రీ షెడ్యూల్ చేసి కొత్త రుణాలు ఇప్పిస్తామని చెప్పారు. తమ వద్ద ఉన్న లెక్కల ప్రకారం విజయవాడ నగరంలో 2.72 లక్షల కుటుంబాలు వరద బారిన పడ్డాయని, ఏడు లక్షల మంది ప్రభావితం అయ్యారని తెలిపారు.

విద్యార్థుల ఫీజుల చెల్లింపు ఒక నెల వాయిదా వేశామని, వరద ప్రాంతాల్లో ఆస్తి పన్ను చెల్లింపు మూడు నెలలు వాయిదా వేశామని చెప్పారు. విద్యార్థుల పుస్తకాలు, సర్టిఫికెట్లు వరదల్లో పోయి ఉంటే, తిరిగి ఇస్తామని తెలిపారు. కేంద్రంతో మాట్లాడుతున్నామని, కొంత సాయం అందుతుందని ఆశిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో నాలుగు వేల కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. బుడమేరు ఆక్రమణలను తొలగించడానికి ఆపరేషన్ బుడమేరు మొదలు పెడతామని ఆయన చెప్పారు. కాగా, వరదల తాకిడికి గురైన రాష్ట్రంలోని మిగిలిన చోట్ల కుటుంబానికి రూ.పది వేలు ఇస్తామని సీఎం వెల్లడించారు.

### రూ. 300 కోట్ల మేర విరాళాలు

వరద బాధితులను ఆదుకోవాలంటూ ప్రభుత్వం ఇచ్చిన పిలుపునకు స్పందించి దాతలు మంగళవారం వరకూ రూ. మూడు వందల కోట్ల మేర విరాళాలు అందించారని ముఖ్యమంత్రి తెలిపారు. ఇంకో వంద నుంచి రూ. నూటా ఏభై కోట్లు అందుతాయని ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. 'మా శక్తినంతా వెచ్చించి పనిచేశాం. మేం చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని విశ్వసించి అనేక మంది వచ్చి విరాళాలు ఇస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే పుతుంబాక భారతి తన చేతి బంగారు గాజులు ఇచ్చారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇస్తున్నారు. అహ్మదాబాద్ వెళ్తే అక్కడ కూడా మన కృషిని మెచ్చుకొన్నారు. దేశం అంతా గుర్తించింది' ' అని ఆయన పేర్కొన్నారు. మీడియా సమావేశంలో మంత్రులు పొంగూరు నారాయణ, పయ్యావుల కేశవ్, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

# అక్టోబర్ 1 నుంచి కొత్త మద్యం పాలసీ

మొదటి పేజీతరువాయి...

వెల్లడించింది. కేబినెట్ సబ్ కమిటీలో సభ్యులైన మంత్రులు కొల్లురవీంద్ర, నాదెండ్ల మనోహర్, సత్య కుమార్, కొండపల్లి శ్రీనివాస్‌లు సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడారు. 6 రాష్ట్రాల్లో మద్యం అమ్మకాలను పరిశీలించామని వారు తెలిపారు. గీత కార్మికులకు 10శాతం మద్యం షాపులు కేటాయిస్తామన్నారు. కొత్త మద్యం పాలసీని బినెట్ ముందుపెడతామన్నారు. గత ప్రభుత్వంలో మద్యం ధరలను విపరీతంగా పెంచారని విమర్శించారు. మద్యం రేట్ పెరగడంతో పేదలు గంజాయికి అలవాటుపడ్డారన్నారు. తక్కువ ధరకే నాణ్యమైన మద్యం ఇస్తామని మంత్రివర్గ ఉపసంఘం పేర్కొంది. ఏపీలో మద్యం విధానం పై ఏర్పాటైన సబ్ కమిటీ అయిదుగురు మంత్రులతో సీఎం ఏర్పాటు చేశారని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గతంలో మద్యం వ్యవస్థను వారి గుప్పిట్లోకి తెచ్చుకోవడానికి ఎక్సైజ్ వ్యవస్థను నాశనం చేశారని ఆయన అన్నారు. 70 శాతం మందితో ఎస్ఈబీ అని పెట్టి ఎన్‌ఫోర్స్‌మెంట్ లేకుండా చేశారన్నారు. ప్రభుత్వ షాపుల్లో జే బ్రాండ్‌లను మాత్రమే అందుబాటులో ఉంచి విచ్చలవిడిగా దోచేశారని ఆరోపించారు. మద్యపాన నిషేదం అని దశలవారీగా ఎత్తేస్తామని చెప్పి పదేపదే మాటమార్చారన్నారు. విపరీతమైన రేట్లు పెట్టి సామాన్యులను అప్పులు పాలు చేశారని.. సామాన్యుల ఆదాయాన్ని దోపిడీ చేశారని విమర్శించారు. ఈ దోపిడీ ఆదాయం వారి జేబుల్లోకి వెళ్ళిపోయిందని.. అర్హత లేని వ్యక్తిని డిప్యూటేషన్‌పై తెచ్చి దోచేశారని ఆరోపించారు. నాసిరకం అయిన బ్రాండ్స్ తెచ్చి ప్రజల ఆరోగ్యాలతో ఆడుకున్నారని, చాలామంది అనారోగ్యం పాలయ్యి చాలామంది మృత్యువాత పడ్డారని అన్నారు. డిస్టలరీల వ్యవస్థను మొత్తం వారి చేతుల్లోకి తీసుకున్నారు. షాపులలో 150 ది ఉందా 200 ది ఉందా అని అడగాల్సి వచ్చింది. నాశిరకం మద్యం తాగలేక నాటుసారా, ఎన్‌డీపీ ఎల్‌లకు వెళ్లిపోయారు. తెలంగాణ, తమిళనాడు, ఒడిశా నుండి ఎక్కవ మద్యం రాష్ట్రానికి వచ్చింది. 1994 తరువాత ఏపీలో పాలసీ దేశానికే ఆదర్శం అయ్యింది. ఇప్పుడు ఆరు రాష్ట్రాలకు వెళ్లి అక్కడ పాలసీ, టాక్సేషన్ విధానంపై అధ్యయనం చేశాం. కల్లుగీత కార్మికులకు 10శాతం షాపులు ఇస్తామని చెప్పాము. ఈరోజు నాల్గవ సమావేశం అయ్యింది. రేపు క్యాబినెట్ ముందు మా ప్రతిపాదనలను సరసమైన ధరలకు నాణ్యంమైన మద్యం అందించాలని నిర్ణయించాం. రేట్లు పెంచడం వల్ల చాలామంది గంజాయికి, డ్రగ్స్‌కు డైవర్ట్ అయ్యారు.మరోవైపు మద్యం నియంత్రణకు కొంత ఫండింగ్ ఇవ్వాలని నిర్ణయించామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మద్యం విధానంపై క్షేత్రస్థాయిలో వివిధ సంఘాల నుంచి నివేదికలు తెప్పించుకున్నామని, క్యాబినెట్‌లో తమ నివేదికలను సమర్పిస్తామని మంత్రులు తెలిపారు. ఏపీలో నూతన మద్యం విధానంపై సీఎం చంద్రబాబుతో మంత్రివర్గ ఉపసంఘం సమావేశమై చర్చించింది. గత పాలకులు జే బ్రాండ్ మద్యం తీసుకువచ్చారు. మద్యపానం నిషేధమని మాయమాటలు చెప్పి సొంత బ్రాండ్లు ప్రవేశపెట్టారు. మల్టీ నేషనల్ బ్రాండ్లు రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకున్నారు. ప్రభుత్వ ఆదాయం పాలకుల జేబుల్లోకి వెళ్లింది. అర్హత లేని వ్యక్తిని డిప్యుటేషన్‌పై తీసుకొచ్చి వ్యవస్థను భ్రష్టుపట్టించారు. నాసిరకం బ్రాండ్లు తెచ్చి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడారు. గత ప్రభుత్వ తప్పుడు విధానాలతో రాష్ట్రం ఆర్థికంగా నష్టపోయింది. గతంలో ఎక్సైజ్ పాలసీని జేబులు నింపుకోవడానికే వాడుకున్నారు. భవిష్యత్తులో వచ్చే ఆదాయంపై కూడా అప్పులు తెచ్చారు. నాణ్యత లేని మద్యం సరఫరా చేసి ప్రజల జీవితాలతో చెలగాటమాడారు. ఆడబిడ్డల పుస్తెలతాళ్లు తెగడంతో వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ప్రజారోగ్యం దృష్ట్యా కొత్త ఎక్సైజ్‌విధానం రావాలని అన్నారు. వివిధ రాష్ట్రాల్లోఅనుసరిస్తున్న విధానాలను ఉన్నతాధికారులు తెలిపారు. ఆరు రాష్ట్రాల నుంచి సేకరించిన సమాచారాన్ని అందజేశారు. పలు మార్పులు చేర్పులతో పాటు తదుపరి కార్యాచరణపై సీఎం పలు సూచనలు చేసినట్లు సమాచారం. అక్టోబర్ 1 నుంచి నూతన మద్యం విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. గురువారంలోపు దీనిపై ప్రకటన వచ్చే అవకాశముంది. క్యాబినెట్ సమావేశంలో దీనిపై చర్చించిన అనంతరం నూతన మద్యం విధానాన్ని ఖరారు చేయనున్నారు.

# బీసీ కార్పొరేషన్ పునర్వ్యవస్థీకరణ

మొదటి పేజీతరువాయి...



సమగ్ర సర్వే నిర్వ హించాలని నిశ్చయించింది. బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ శాఖపై మంగళవారమిక్కడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహి ంచారు. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు బీసీ సంక్షేమ మంత్రి ఎస్. సవిత విలేకరులకు తెలిపారు. గడచిన ఐదేళ్లలో బీసీలు పూర్తిగా చితికిపోయారని.. చం ద్రబాబు రాకతో వారికి పూర్వ వైభవం వచ్చిందన్నారు. జాతీయ బీసీ కార్పొరేషన్ నుం చి ఏటా రూ.100 కోట్లు రాబట్టడానికి అవసరమైన మ్యాచింగ్ గ్రాంట్ ఇస్తామని చెప్పా రు. బీసీల నుంచి పారిశ్రామికవేత్తలు వచ్చే విధంగా వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపేలా ఎంటర్ప్రెన్యూర్ డెవల్పమెంట్ ప్రోగ్రామ్ను రూపొందిస్తామన్నారు. బీసీ-ఏలో ఉన్న అత్యంత వెనుకబడిన కులాల అభివృద్ధికి ప్రణాళికకు చర్యలు తీసుకుంటామని చెప్పా రు. బీసీల వృత్తి నైపుణ్యాలను మెరుగుపరిచి పీఎం-విశ్వకర్మ పథకం వర్తింపజేస్తామని తెలిపారు. చట్ట సభల్లో వారి ప్రాతినిధ్యం పెంచేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయా లని నిర్ణయించినట్లు చెప్పారు. బీసీ రక్షణ చట్టం రూపకల్పనకు సీఎం ఆదేశించార న్నారు. బీసీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలపై నివేదిక కోరినట్లు చెప్పారు.

### కీలక నిర్ణయాలివీ..

గత ప్రభుత్వంలో ఉన్న రూ.110 కోట్ల డైట్ చార్జీల బకాయిల విడుదల.

రూ.20.52 కోట్ల కాస్మోటిక్ చార్జీల బకాయిలు కూడా.

వసతి గృహాల విద్యార్థులకు వ్యక్తిగతంగా ఇస్తున్న ట్రంకు పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, బెడ్డింగ్ మెటీరియల్ కోసం రూ.25 కోట్లు.

హాస్టళ్లలో డిజిటల్ కంటెంట్ విద్యా ప్రమాణాళ పెంపుదలకు ఎస్ఆర్ శంకరన్ రిసోర్స్ సెంటర్ల ఏర్పాటు..

ప్రీ-మెట్రిక్, పోస్టు మెట్రిక్ స్కాలర్షిప్పుల నిమిత్తం కేంద్రం వాటా రూ.133.78 కోట్లతోపాటు రాష్ట్ర మ్యాచింగ్ గ్రాంటు రూ.89.18 కోట్లు విడుదల.

100 మంది బీసీ విద్యార్థులతో ఐఏఎస్ స్టడీ సర్కిల్.

ఎన్టీఆర్ విదేశీ విద్యా పథకం కింద నాణ్యమైన విదేశీ విద్యా సంస్థల్లో అత్యధిక విద్యార్థులకు అవకాశం కల్పించేలా చర్యలు.

ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం పునరుద్ధరణ.

బీసీ స్టడీ సర్కిళ్ల బలోపేతానికి రూ.10 కోట్లు

చిత్తూరు, శ్రీకాకుళం, కర్నూలులో అసంపూర్తిగా నిలిచిపోయిన బీసీ భవనాల నిర్మాణానికి రూ.8 కోట్లు.

మిగిలిన 23 జిల్లా కేంద్రాల్లోనూ బీసీ భవన నిర్మాణానికి స్థలాలు గుర్తించి నిర్మాణాలు.

అన్ని బీసీ గురుకుల విద్యాలయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు.. ఆర్టీజీఎస్‌తో అనుసంధానం.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో నిర్మాణంలో ఉన్న 4 రెసిడెన్షియల్ స్కూళ్ల పూర్తికి 75 కోట్లు. ఈ విద్యాసంవత్సరంలోనే ప్రారంభం.

రాష్ట్రంలో 5 చోట్ల ఫ్యాకల్టీ డెవల్పమెంట్ సెంటర్లు.

కులాలవారీగా తలసరి ఆదాయం ఆధారంగా బీపీఎల్ కుటుంబాల గుర్తింపు.. వారి ఆర్థికాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక.

గత టీడీపీ ప్రభుత్వంలో 68 కాపు భవనాలకు అనుమతులు మంజూరు. వాటిలో నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా నిలిచిపోయిన 2 భవనాల పూర్తికి రూ.2.36 కోట్లు విడుదల. మిగిలిన 66 కాపు భవనాల నిర్మాణాలకు ప్రణాళికలు.

### నీరు-చెట్టు బిల్లులు తక్షణమే చెల్లించండి

### అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష

నీరు-చెట్టు పథకం కింద రైతులకు చెల్లించాల్సిన రూ.256 కోట్లను తక్షణమే చెల్లించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ పథకంలో పెండింగ్ బిల్లులన్నింటినీ విడతల వారీగా విడుదల చేయాలని సీఎం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. నీరు-చెట్టు కార్యక్రమంపై మంగళవారం ఆయన వెలగపూడి సచివాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా పెండింగ్ బిల్లులపై ఆర్థిక, జల వనరుల శాఖ అధికారుల నుంచి సమాచారం కోరారు. కాగా, నీరు-చెట్టు బిల్లులపై సీఎం ప్రకటనను సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు స్వాగతించారు. జగన్ నాడు బిల్లులు చెల్లించకుండా రైతులను నానా అగచాట్లకు చేశారని, కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో వాటికి మోక్షం కలిగిందన్నారు.

## ఎట్టకేలకు ఒక బోటు బయటికి..

మొదటి పేజీతరువాయి...

బోటును కావడి విధా నంలో రెండు జంట బోట్లు కదిలించింది. బోటుపైకి ఎక్కిన ఈ బోటును ఆక్సి ఆర్క్ కట్టర్ ద్వారా రెండు ముక్కలు చేసి క్రేన్ల ద్వారా తొలగించాలని ప్రణాళిక వేశారు. ఇది విఫలమవ్వడంతో కాకినాడ నుంచి అబ్బు లు టీంను రంగంలోకి దింపారు. బెకమ్ కంపెనీ, వైజాగ్‌కు చెందిన సీ లయన్ సంస్థ, అబ్బులు టీం కలిసి సంయుక్తంగా శ్రమించి బోల్తా పడిన బోటును ఒక దిశలోకి తీసుకొచ్చాయి. నీటిలో మునిగిపోయిన ఈ బోటును ఒడ్డుకు తీసుకురావడానికి రెండు బోట్లకు ఇనుప గడ్డర్లను అమర్చి రంగంలో దింపారు. ఈ ప్రయత్నంతో నీటిలో మునిగిన బోటు కొంతమేరకు పైకి కనిపించింది. ఈ బోటును లాగడం కోసం కొత్తగా ఏర్పాటు చేసిన బోట్ల వల్ల కాకపోవడంతో మరో రెండు బోట్లను మంగళవారం రంగంలోకి దింపారు. ఇనుప గడ్డర్లతో ఉన్న రెండు బోట్లను కొత్తగా వచ్చి బోట్లకు ఇనుప రోప్తో లాక్ చేశారు. ఈ రెండు బోట్లు కదిలిన తర్వాత వెనుక ఇనుప గడ్డర్లతో ఉన్న బోట్లు కదిలాయి. నీటిలో మునిగిన ఉన్న బోటు మాత్రం కొంతమేరకే కదిలింది. ముందున్న రెండు బోట్లు కాస్త బలంగా ముందుకు కదిలే సరికి ఇనుప గడ్డర్లు ఉన్న బోటుకు మునిగిన బోటును లాక్ చేసిన రోప్ తెగిపోయింది. దీంతో డైవర్లు నీళ్లలోకి దిగిన మళ్లీ రోప్లను బిగించారు. బోటు నీళ్లలో మునిగిపోవడంతో బరువు పెరిగిపోయింది. నీటితోపాటు ఇసుక బోటులోకి చేరి ఉంటుందని, అందుకే బోటు బరువు బాగా పెరిగిందని అనుమానించారు. అయినా మునిగిన బోటును రాత్రి కొంతదూరం వరకు ఈ బోట్లు లాక్కొచ్చాయి. తర్వాత ఆ బోటులో ఉన్న నీటిని మోటారు ద్వారా తోడేశారు. దీంతో దాని బరువు తగ్గింది. తర్వాత నాలుగు బోట్లు కలిసి ఈ బోటును పున్నమిఘాట్ వైపునకు లాక్కెళ్లాయి. తొలుత ఈ బోటును గొల్లపూడి రేవుకు చేర్చాలని భావించారు. బ్యారేజీ గేటు నుంచి బయటకు రావడానికే 11 రోజుల సమయం పట్టినందున, ముందస్తు ఆలోచనతో భవానీపురం చేపల రేవు వద్దకు గానీ, పున్నమిఘాట్ దాటిన తర్వాత గానీ ఒడ్డుకు చేర్చాలని భావిస్తున్నారు. ఇసుక మేట తగిలే ప్రదేశంలో ఈ బోటును విడిచిపెడతారు.

### నేటి నుంచి మరో రెండు బోట్ల వెలికితీత పనులు

ఇంకా ప్రకాశం బ్యారేజీ వద్ద రెండు బోట్లు ఉన్నాయి. వాటిని తొలగించే చర్యలు బుధవారం చేపడతారు. ప్రస్తుతం తొలగించిన బోటు మునిగిన ప్రదేశంలో ఒక చిన్న బోటు ఉన్నట్టు గుర్తించారు. ముందుగా దాన్ని బయటికి తీసుకొచ్చే అవకాశాలు ఉన్నాయి. బ్యారేజీ వద్ద జరుగుతున్న బోట్ల ఆపరేషన్ను మంత్రులు రామానాయుడు, అనిత పరిశీలించారు. వైసీపీ నేతలు ఉగ్రవాదుల కంటే ప్రమాదకరమని, బోట్లు కొట్టుకురావడంతో కచ్చితంగా కుట్రకోణం దాగి ఉందని చెప్పారు. బోట్లకు సంబంధించి విచారణ సాగుతోందన్నారు.

## గూగుల్ టేకౌట్‌తో గుట్టు రట్టు

**అమరావతి, సెప్టెంబర్ 17 (మనం న్యూస్):** నాటి ముఖ్యమంత్రి జగన్ స్నేహితుడిని రక్షించేందుకు అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, విజయవాడ పోలీసు కమిషనర్ కాంతిరాణా తాతా, డీసీపీ విశాల్ గున్నీ, వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ చేసిన పథక రచనకు సంబంధించిన కీలకమైన డిజిటల్ ఆధారాలు దర్యాప్తు అధికారుల చేతికి చిక్కాయి. జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైన ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఇందులో ఎంతటి వ్యక్తులున్నా వదలవద్దని పోలీసు ఉన్నతాధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ముంబై నటి జెత్వానీ తన తల్లితో కలిసి విజయవాడకు వచ్చి తనకు నాడు జరిగిన అన్యాయం, వేధించిన వ్యక్తులు, ఇబ్బంది పెట్టిన అధికారులపై పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబుకు ఫిర్యాదు చేశారు. ఆయన సూచన మేరకు ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్లో ఆమె రాతపూర్వక ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. అందులో మొదటి నిందితుడిగా ఉన్న కుక్కల విద్యా సాగర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఆయన ఆచూకీ కోసం టెక్నాలజీ ప్రయోగించడంతో విస్తుపోయే నిజాలు బయట పడ్డాయి. ఆయన సెల్ నెంబర్ ఆధారంగా ఎక్కడున్నారో కూపీలాగే ప్రయత్నంలో గూగుల్ టేకౌట్ను ప్రయోగించినట్లు తెలిసింది. అయితే ఫిబ్రవరి 2న విద్యాసాగర్ ముంబైలో విశాల్ గున్నీ ఇతర పోలీసులతో కలిసి ఉన్నట్లు బయటపడింది.

### 'సకల శాఖల మంత్రి' ఆదేశాలతోనే..

జెత్వానీని ముంబై నుంచి తీసుకురావడానికి ఆనాడు విజయవాడ పోలీసులు గన్నవరంలో విమానం ఎక్కితే.. విద్యాసాగర్ హైదరాబాద్‌లో బయలు దేరి ముంబైకి చేరుకున్నారు. అంతకు ముందు తాడేపల్లి ప్యాలెస్‌లో వేసుకున్న స్కెచ్ ప్రకారం జెత్వానీ కదలికలు, అమె నివాసం ఎక్కడుందో తెలిసిన వ్యక్తిని తీసుకెళ్లాలని నిఘా విభాగం అధిపతి సూచించినట్లు తెలిసింది. ముగ్గురు ఐపీఎస్లు తాడేపల్లి ప్యాలెస్‌లో మాట్లాడుకున్నప్పుడు సకల శాఖల మంత్రిగా పేరు గాంచిన నాయకుడు....విద్యాసాగర్ను అక్కడికి పిలిపించారు. 'పోలీసు అధికారులకు సహకరించు' అని సూచించినట్లు సమాచారం. విజయవాడలో ఒకే విమానం ఎక్కితే తెలిసిపోతుందని, హైదరాబాద్ నుంచి విద్యాసాగర్ బయలుదేరినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ముంబైలోని జూహూలోని గుల్మహర్ రోడ్డులో ఉన్న ఐడియల్ అపార్ట్మెంట్లో జెత్వానీ తన కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. ఆమె తన కుటుంబంతో కలిసి కారులో బయటకు రావడం విద్యాసాగర్ చూశారు. ఆ సమాచారం పోలీసులకు ఇచ్చి.. తాను కారులో వారిని అనుసరించినట్లు సమాచారం. గూగుల్ టేకౌట్ ద్వారా కేసులో డిజిటల్ ఆధారాలు సేకరించే పనిలో బెజవాడ పోలీసులు ఉన్నారు. ఈ క్రమంలో ఐపీఎస్ అధికారులకు, వైసీపీ నేతలకు మధ్య నడిచిన వాట్సాప్ సందేశాలు, మెయిల్స్ పరిశీలిస్తున్నట్లు తెలిసింది. పక్కా ఆధారాలు సేకరించిన తర్వాతే పెద్ద ఖాకీలను నిందితులుగా చేర్చాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అన్నీ సేకరించుకుని విద్యాసాగర్ కేసులో అదర్స్ అనేచోట ఏ2, ఏ3, ఏ4గా పెద్ద పోలీసుల్ని చేర్చబోతున్నట్లు సమాచారం. ఆధారాలు బలంగా ఉంటే ఇదే ఎఫ్ఐఆర్లో సెక్షన్ 120(బి) చేర్చి కుట్ర కోణాన్ని పూర్తిస్థాయిలో ఉచ్చు బిగించనున్నట్లు తెలుస్తోంది. ఫోను స్విచ్ఛాఫ్ చేసి పరారీలో ఉన్న విద్యాసాగర్ కోసం లుక్ అవుట్ నోటీసులు జారీచేసే యోచనలో పోలీసులు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

### జెత్వానీ కేసులో ఎవరినీ వదలబోం: హోంమంత్రి

జెత్వానీ కేసులో ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తి లేదని హోంమంత్రి అనిత అన్నారు. దీనివెనుక ఉన్న అందరినీ శిక్షిస్తామని స్పష్టం చేశారు. ''కాదంబరి కేసులో సస్పెండ్ అయిన ఐపీఎస్ అధికారుల వెనుక ఎంతమంది ఉన్నా వదిలిపెట్టబోం. వారి వెనుక సలహాదారులు ఉన్నా, సూత్రధారులు ఉన్నా వదిలిపెట్టబోం'' అని అనిత హెచ్చరించారు.

# తెలంగాణ ప్రజలు విముక్తి పొందిన రోజు

- సాయుధ పోరాటంలో జిల్లాలోని గ్రామాల ప్రజల పోరాటం ఎనలేనిది
- ఎన్ హెచ్ 65 విస్తరించేందుకు అన్ని రకాలుగా ప్రణాళికలు
- రోడ్డు ప్రమాదాల నివారణ ప్రధాన లక్ష్యం
- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి





**నల్లగొండ,సెప్టెంబర్ 17 (మనం ప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్ర సాధన ఘనత అమరులదే నని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17 కీలకమైన రోజని, నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణ ప్రజలు విముక్తిని పొందిన రోజు సెప్టెంబర్ 17 అని అన్నారు.తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రజలను ఉద్దేశించి మంత్రి సందేశం ఇస్తూ, ఆగస్టు 15, 1947 న దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటికీ ,హైదరాబాద్ సంస్థానానికి రాలేదని ,అప్పటి నిజాము హైదరాబాద్ సంస్థానాన్ని స్వతంత్రంగా ఉంటుందని ప్రకటించారని, నిజాం నిరంకుశపాలనలో భూస్వామ్య వ్యవస్థకు , జాగిర్దారి విధానం, వేట్టి చాకిరి, బలవంతంగా పన్నులు వసూలు చేయడం , రజాకారుల దాష్టికం ,ఆగడాలను తెలంగాణ ప్రజలు భరించలేక నిజామ్ వ్యతిరేక పోరాటాన్ని ప్రారంభించారని, రైతులు, మహిళలు, సకల జనులు ఏకమై హైదరాబాద్ సంస్థానాన్ని భారత్ యూనియన్లో విలీనం చేయాలని సాయిధ పోరాటాన్ని ఉధృతం చేశారన్నారు. ఇందుకోసం నాటి ఆంధ్ర జన కేంద్ర సభ, ఆంధ్ర మహాసభలో పనిచేసిన మహానుభావులు ఎందరో తెలంగాణ ప్రజలను చైతన్య పరచారని, ప్రత్యేకించి తెలంగాణ సాయుధ పోరాటంలో నల్గొండ జిల్లా కీలక పాత్ర పోషించిందని, ముఖ్యంగా భీంరెడ్డి నరసింహారెడ్డి, బొమ్మ గాని ధర్మభిక్షం, ఆరుట్ల రామచంద్రారెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, జిట్టా రామచంద్రారెడ్డి, సుశీలాదేవి, సుద్దాల హనుమంతు, బొందుగుల నారాయణరెడ్డి వంటి ఎంతోమంది త్యాగధనులు తెలంగాణలో స్వతంత్ర ఉద్యమాన్ని ప్రభావితం చేశారన్నారు. దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమం తీవ్రమైందని, చాకలి ఐలమ్మ మల్లు స్వరాజ్యం ఇందులో కీలక పాత్ర పోషించారని, బండి యాదగిరి రాసిన బండేనక బండి కట్టి..పాట తెలంగాణ సాయుధ పోరాటాన్ని మరో మెట్టు ఎక్కించగా, నల్గొండ జిల్లాకు చెందిన సుద్దాల హనుమంతు వెట్టిచాకిరిని వ్యతిరేకిస్తూ పాలబుగ్గల జీతగాడ..అనే పాట సాయిధ పోరాటాన్ని ఉధృతం చేసేందుకు దోహద పడిందని అన్నారు. భూస్వామ్య ,జమీందారులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో నల్గొండ జిల్లాలోని అనేక గ్రామాలు గుండ్రంపల్లి, కడవెండి ,రావులపెంట, ఎనిమిది గూడెం, ప్రాంతాలు కేంద్ర బిందువులుగా నిలిచాయని తెలిపారు. హైదరాబాద్ రాష్ట్రంలో ప్రజలపై రజాకారులు, జమీందారుల దాడులు పెరుగుతున్నాయని గ్రహించి అప్పటి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసేందుకు సైన్యాన్ని రంగంలోకి దింపి భారత యూనియన్ లో విలీనం చేశారని తెలిపారు .1948, 17 సెప్టెంబర్ న హైదరాబాద్ రాష్ట్రాన్ని ఇండియన్ యూనియన్ లో విలీనం చేస్తూ నిజాం ప్రకటించారని అందుకే ఈ రోజున ప్రజాపాలన దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. తదనంతరం 1952 లో సార్వత్రిక ఎన్నికలు జరగడం ,అనంతరం భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు కావడం, తెలంగాణకు అన్యాయం జరుగుతున్నదని గ్రహించిన తెలంగాణ ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి నాంది పలికిందని, ఈ ఉద్యమంలో 300 మందికి పైగా అమరులయ్యారని తెలిపారు. కొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రొఫెసర్ జయశంకర్, జలగం వెంగళరావు లాంటి వారు తెలంగాణ తొలిదశ ఉద్యమాన్ని ముందుండి నడిపించారని, అనంతరం ఏర్పాటు చేసిన జోనల్ వ్యవస్థ సైతం తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర కాంక్ష తీర్చలేక పోయిందని, ఫలితంగా 2011 నుండి తెలంగాణ మలిదశ ఉద్యమం ప్రారంభమైందని, తెలంగాణ ఐక్య కార్యచరణ సమితి నాయకత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల తీవ్ర ఉద్యమం చేశారని ,నల్గొండ జిల్లాకు చెందిన కాసోజు శ్రీకాంతాచారి తో పాటు, ఎంతో మంది యువకులు ప్రాణాలు కోల్పోయారని,తాను సైతం మంత్రి పదవికి రాజీనామా చేసి 11 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేశానని తెలిపారు. తెలంగాణ ఉద్యోగులు, కార్మికులు, తమ ఉద్యోగాలను పణంగా పెట్టి 42 రోజుల పాటు సకల జనుల సమ్మె చేశారని ,2011 మార్చి 10 న మిలియన్ మార్చ్ పేరుతో లక్షల మంది ఉద్యమకారులు హైదరాబాదులో ప్రజలను కదం తొక్కారని, వంటావార్పు, సాగరహారం, ధర్నాలు చేసిన తీరును చూసి అప్పటి ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తూ శ్రీకృష్ణ కమిటీని నియమించిందని ,అక్టోబర్ 2013 న కేంద్ర మంత్రిమండలి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆమోదం తెలిసిందని, 2014 తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయిందని తెలిపారు.ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమరులకు ,మహిళలకు, రైతులకు, అన్ని వర్గాల ప్రజలకు గౌరవాన్ని కల్పిస్తూ ప్రభుత్వం ముందుకెళుతున్నదని తెలిపారు . హైదరాబాద్ కోటి లోని మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా, హ్యాండ్లూమ్ టెక్నాలజీ సంస్థకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేర్లు పెట్టడం జరిగిందని తెలిపారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొటిగా అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని, ప్రభుత్వ ,ప్రభుత్వంగ సంస్థలు కొత్త ఉద్యోగాల కల్పనకు జాబ్ క్యాలెండర్ ను ప్రకటించామని, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించడం జరిగిందని, ఆరోగ్య శ్రీ పరిమితిని ఐదు నుండి 10 లక్షల రూపాయలకు పెంచామని, మహాలక్ష్మి పథకం కింద నిరుపేదలకు 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని , ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సైతం ప్రారంభించనున్నామని, నిరుపేదలకు గృహ జ్యోతి కింద నేలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని ,చరిత్రలో కనివిని ఎరగని వీటిలో రైతులకు ఏకకాలంలో రెండు లక్షల వరకు రుణమాఫీ చేశామని, నల్గొండ జిల్లాలో లక్ష 73 వేల రైతు కుటుంబాలకు 1433 కోట్ల రూపాయలు రుణమాఫీ జరిగిందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఇంకా కష్టపడి నల్గొండ జిల్లా రైతులకు అండగా ఉంటామని తెలిపారు . ప్రజాగాయకుడు గద్దర్ పేరిట సినీ అవార్డులను ఏర్పాటు చేశామని, అందే శ్రీ రాసిన జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రకటించుకున్నామని, బహుజన ప్రజారాజ్య స్థాపకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నామని, మహిళలకు పూర్తి అధికారం ఇస్తూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేశామని ,పారిస్ పారా ఒలంపిక్ లో పథకం సాధించిన తెలంగాణ బిడ్డ జీవంజి దీప్తికి కోటి రూపాయల పారితోషకాన్ని ప్రభుత్వం ఇవ్వడమే కాకుండా 500 గజాల ఇంటి స్థలాన్ని సైతం ఇచ్చిందని, ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత గురుకుల పాఠశాలలను నిర్మిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ ప్రకటించామని అన్నారు .నల్గొండ జిల్లా ప్రజల కష్టాలను తీర్చేందుకు తను స్వయంగా వారానికి ఒక రోజు ప్రజా దర్బార్ నిర్వహించి వారి కష్టాలను తీర్చడం జరుగుతున్నదని తెలిపారు .ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఎస్ ఎల్ బి సి టన్నెల్ నిర్మాణం కోసం ఇటీవల అమెరికా వెళ్లి టన్నెల్ బోరింగ్ రిపేరికి చర్యలు తీసుకోవడం జరిగిందని ,త్వరలోనే ఎస్ఎల్బీసీ టన్నెల్ పనులను రాష్ట్ర మంత్రి ఉప ముఖ్యమంత్రి, ఇరిగేషన్ శాఖ మంత్రితో ,ఇతర ప్రజాప్రతినిధులందరితో కలిసి పరిశీలించనున్నామని మంత్రి వెల్లడించారు . నల్గొండలో కరెంటు మోటార్లు మోటర్ లేని వ్యవసాయం చూడాలన్నదే తమ అభిమతమని, బ్రాహ్మణ వెల్లేముల లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసి జిల్లాను సస్య శ్యామలం చేస్తామని అన్నారు .275 కోట్ల రూపాయలతో ప్రభుత్వ వైద్య కళాశాల, 20 కోట్ల రూపాయలతో నర్సింగ్ కళాశాల నిర్మించుకుంటున్నామని, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను సైతం నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర దశ, దిశను మార్చే రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సర్వం సిద్ధంగా ఉందని, అలాగే రాష్ట్ర అభివృద్ధిలో సూపర్ గేమ్ చేంజెర్ గా రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం విలువనుందని, నల్గొండ జిల్లా ప్రజలకు ముఖ్యమైన జాతీయ రహదారి 65 హైదరాబాద్– విజయవాడ నిత్య ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని విస్తరించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని ,541 కోట్ల రూపాయల అంచనా తో ఆందోల్ మైసమ్మ నుంచి తెలంగాణ రాష్ట్ర సరిహద్దు వరకు కొత్త టెండర్లను పిలవడం జరిగిందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. నల్గొండ జిల్లాలో 2024 –25 సంవత్సరంలో 241.90 కిలోమీటర్ల రోడ్లు, బ్రిడ్జిలు, మూడు భవనాల మరమ్మతులకు 512 కోట్ల 81లక్షల రూపాయలు మంజూరు చేసామని చెప్పారు.జిల్లా సర్వతో ముఖాముఖివృద్ధికి జిల్లాలోని ప్రతి ఒక్కరు తన సహకారం అందించాలని మంత్రి కోరారు. అంతకుముందు మంత్రి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు.తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్ ,నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, అదనపు కలెక్టర్లు టీ .పూర్ణచంద్ర, జే శ్రీనివాస్ ,అదనపు ఎస్పి రాములు నాయక్, డిఆర్ఓ రాజ్యలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, ఆర్డిఓ రవి, జిల్లా అధికారులు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## ప్రజా పాలన దినోత్సవ వేడుకలు

- డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి



**వలిగొండ, సెప్టెంబర్ 17 ( మనం న్యూస్) :** వలిగొండ మండల కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీలో మంగళవారం కాలనీ అధ్యక్షులు, డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగురవేసి ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఏ ప్రభుత్వం చేయ నటువంటి సాహసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరిట చేయటం శుభ సూచికమన్నారు. ఈ కార్యక్రమంలో జేల్ల నరే ందర్, యాదిరెడ్డి, సుధాకర్ రెడ్డి, సంజీవరెడ్డి, జూకంటి ము త్యాలు, సుధాకర్, ప్రభాకర్, దీక్షిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టల్స్, గురుకులాలకు భవనాలు నిర్మించాలి



**సూర్యాపేట,సెప్టెంబర్ 17(మనం ప్రతినిధి) :** రాష్ట్రంలో కొనసాగుతున్న సంక్షేమ హాస్టల్స్,గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, విద్యార్థులకు ప్రస్తుతం అందించే మెస్ చార్జీలు రూ.1500 నుండి రూ .4000 లకు పెంచాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెల్లి మహేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పేద విద్యార్థుల విద్యా,ఆర్థిక,మానసిక,ఆరోగ్య సాధనకై టిఎస్ఎస్ఎ ఆధ్వర్యంలో నవంబర్ 22న హనుమకొండలో నిర్వహించబోయే విద్యార్థి యుద్ధభేరి మహాసభను జయప్రదం చేయాలని ఆయన కోరారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని పలు ఎస్సి,ఎస్టీ,బీసీ బాలురు,బాలికల వసతి గృహాలను వెళ్లి ఆయన విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మహేష్ కుమార్ మాట్లాడుతూ విద్యతోనే దేశం అభివృద్ధి గాంచుతుందని,అట్టి విద్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష చూపితే ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు.ఇప్పటికే పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్,స్కాలర్షిప్స్ తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ అన్ని గురుకులాలకు వెంటనే పూర్తి స్థాయి ప్రిన్సిపల్స్ లను నియమించాలని కోరారు. సంక్షేమ హాస్టల్స్,గురుకులాల్లో ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మిట్ చేయాలని, ప్రైవేట్,కార్పొరేట్ స్కూల్స్, కాలేజీల్లో ప్రభుత్వ సీట్లను పెంచాలని, ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులు,వర్కర్స్ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని కోరారు.విద్యార్థుల కోసం డిజిటల్ లైబ్రరీ,స్పోకెన్ ఇంగ్లీష్ సెంటర్స్ ఏర్పాటు చేయాలని,నూతనంగా ఏర్పడ్డ జిల్లా కేంద్రాలలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు,ఇంజనీరింగ్ కాలేజీలు, ఫార్మసీ కాలేజీలను ఏర్పాటు చేయాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా విద్యార్థి యుద్ధబేరి మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్ ను ఆయన విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు శ్రీనివాస్,ప్రవీణ్, నాగమణి,శోభిత,సతీష్, ఉదయ్,నవ్య,వీరబాబు,అనిల్,తదితరులు పాల్గొన్నారు.

## నేడు ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు సాగు నీరు విడుదల.?

- మంత్రి ఉత్తమ్ ఆదేశాలతో ఎంబి కెనాల్ గండి పూడ్చివేత
- రెండు రోజులలోనే కెనాల్ గండి పూడ్చటం పట్ల రైతులు హర్షం



**హుజూర్ నగర్, సెప్టెంబర్ 17 (మనం న్యూస్) :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ హుజూర్ నగర్ మండల పరిధిలోని కరక్కాయల గూడెం గ్రామం వద్ద గండిపడిన విషయం తెలిసిందే. ఆదివారం పౌరసరఫరాల,నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ ను పరిశీలించి రాత్రింబవళ్లు వర్క్ చేసి కెనాల్ గండిని పూడ్చి పంట పొలాలకు సాగు నీరు అందించి రైతులకు నష్టం కలగకుండా చూడాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులను దగ్గర ఉండి పనుల పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మంత్రి ఉత్తమ్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు కాంట్రాక్టర్, ప్రజాప్రతినిధులు దగ్గర ఉండి 2 రోజులలో గండిని పూడ్చి వేశారు.నేడు ఎంబి కెనాల్ అధికారులు సాగు నీరు విడుదల చేయనున్నారు.ఎంబి కెనాల్ కు నేడు సాగు నీరు విడుదల చేయటం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి ఉత్తమ్ కు కృతజ్ఞతలు తెలుపు తున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి గూడెపు శ్రీనివాస్,కుందూరు శ్రీనివాసరెడ్డి,నాగిరెడ్డి, ఇరిగేషన్ అధికారులు, పాల్గొన్నారు.


## చరిత్రను వక్రీకరిస్తే చూస్తూ సహించేది లేదు



- ఎండి.జహంగీర్ సిపిఎం జిల్లా కార్యదర్శి

**వలిగొండ, సెప్టెంబర్ 17 (మనం న్యూస్) :** కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరిగిన వీరోచిత సాయుధ రైతాంగ పోరాటాన్ని వక్రీకరిస్తే సహించేది లేదని బిజెపి మత ఉన్మాద విధానాలను మానుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ అన్నారు. మంగళవారం సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా పులిగిల్ల, సుంకిషాల, పహిల్వాన్ పురం, రెడ్ల రేపాక గ్రామాల్లో నాటి పోరాట అమరుల స్థూపాల వద్ద పూల మాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం జరిగిన సభల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నాడు తెలంగాణ ప్రాంతంలో భూమి, భుక్తి, విముక్తి కోసం, దొరల దోపిడీ దారుల నుండి స్వేచ్ఛ, సమానత్వం కోసం జరిగిన మహోన్నత పోరాటమన్నారు. చరితతో ఎలాంటి సంబంధం లేని బిజెపి నాటి చరిత్రను వక్రీకరిస్తుందని చరితను వక్రీకరిస్తే సహించేది లేదన్నారు. ఈ పోరాటంలో కులం, మతం సంబంధం లేకుండా నైజాం రజాకార్లకు తాబేదార్లుగా ఉన్న భూస్వాముల, పటేల్ పట్వారీల దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పేదలపై వేసిన నిర్బంధపు వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున మహా ఉద్యమం జరిగిందన్నారు. దీనిలో వివిధ వృత్తులకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారని గుర్తుచేశారు ఈ పోరాటంలో 4వేల మంది అమరులయ్యారని 10 లక్షల ఎకరాల భూమిని కమ్యూనిస్టులు స్వాధీనం చేసుకుని పేదలకు పంచారని అన్నారు. విసునూరు రామచంద్రారెడ్డి, జన్నారెడ్డి ప్రతాప్ రెడ్డి, విఠల్ రావు లాంటి భూస్వాములు హిందువులే కదా? వీరు నైజాం ఏజెంట్లు కదా అని ప్రశ్నించారు. బిజెపి మతోన్మాదంను రెచ్చగొట్టి ప్రయోజనం పొందాలని చూసే కుట్రలను తిప్పి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ప్రాంతంలో పులిగిల్ల, సుంకిషాల, మొగిలిపాక, పహిల్వాన్పురం, రెడ్ల రేపాక లాంటి అనేక గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున ఈ ఉద్యమంలో పాల్గొన్నారని వారి యొక్క స్ఫూర్తి చైతన్యాన్ని ముందుకు తీసుకుపోయేందుకు ప్రజలంతా కమ్యూనిస్టులు చేస్తున్న ప్రజా పోరాటాల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాడు కమ్యూనిస్టులు చేసిన పోరాటాల ద్వారా నేటికీ పాలకులు భూమి పంపకమనే మాటను వీడడం లేదని వారి యొక్క పోరాట స్ఫూర్తి నేటికి కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్ , పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్ల పల్లి ముత్యాలు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడ్య రాజు, సిపిఎం సీనియర్ నాయకులు కొమ్మిడి లక్ష్మిరెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు తుర్కపల్లి సురేందర్, చీర్క శ్రీశైలం రెడ్డి, మండల కమిటీ సభ్యులు వాకిటి వెంకట్ రెడ్డి, కందాడి సత్తిరెడ్డి, కొండే కృష్ణయ్య, సిపిఎం నాయకులు మంగ బాలయ్య, రేపాక ముత్యాలు, రాదరపు మల్లేషం, కొమ్ము స్వామి, చేగురి నగేష్, ఎండి.ఖజా, బంధారపు దనుంజయ్య, పోలేపల్లి ఉప్పలయ్య, వడ్డేమని వెంకటయ్య, వేముల అమరెందర్, మారబోయిన ముత్యాలు, ఈర్ల రమేష్, వడ్డేమాని రవి, సందేల సాయిలు, కందుల శంకరయ్య, లింగస్వామి, గాడిపల్లి వెంకయ్య, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నైజాం నవాబ్‌కు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర కమ్యూనిస్టులది



**చింతలపాలెం, సెప్టెంబర్ 17 (మనం న్యూస్) :** నైజాం నవాబ్ సైన్యాన్ని వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర కమ్యూనిస్టులదని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లే వెంకటరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వరోత్సవాల సందర్భంగా అమరవీల స్థూపాలకు పూలమాలవేసి నివాళులప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం భూమికోసం పేద ప్రజల హక్కుల కోసం జరిగిన పోరాటంలో మల్లారెడ్డి గూడెం గ్రామానికి చరిత్ర ఉన్నదన్నారు. తెలంగాణ ప్రాంతంలో పేదలకు ప్రజలకు 10 లక్షల ఎకరాలు భూ పంపిణీ చేసిన చరిత్ర ఎర్రజెండాలను వారన్నారు. పెట్ట బడుగుదారులకు, భూస్వాములకు, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిపిన పోరాటంలో ఎంతోమంది పేదలు ప్రాణాలర్పించినారని, మండలంలో ప్రభుత్వ భూములు పేదలకు ప్రభుత్వం పంచకపోతే తెలంగాణ పోరాటం స్ఫూర్తితో పేదలను సమీకరించి భూ పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. బిజెపి ప్రభుత్వం తెలంగాణ సాయుధ పోరాటం సంబంధంలేని బిజెపి ఆర్ఎస్ఎస్ హిందూ ముస్లింల మధ్య జరిగిన పోరాటం బిజెపి నాయకుల మాటలు సరైన కావని విమర్శించినారు. ఎట్టి చాకిరికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించి, పేదలను ఐక్యపరిచి, ముందుకి నడిపించడంలో కమ్యూనిస్టులు అగ్రభాగాన ఉన్నారన్నారు. పేదలకు రేషన్ కార్డులు పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినారు. తెలంగాణ అంటే కమ్యూనిస్టులు కమ్యూనిస్టులు అంటేనే తెలంగాణ కోసం త్యాగాలు చేసి ప్రాణాలర్పించిన 3,000 మంది అమరవీరుల వారసంగా ఎర్రజెండా ముందుకి తీసుకుపోతామని వారు ప్రజలకు పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వట్టేపు సైదులు, చింతలపాలెం మండల కార్యదర్శి కందుల సుందరమలేశ్వర రెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శీలం శీను, గ్రామశాఖ కార్యదర్శి జంగాల పుల్లయ్య, మండల నాయకులు వీరబాబు, శీలం వెంకన్న, షేక్ జానీమియా, షేక్ మస్తాన్, వేముల భూలక్ష్మి, యరబోలు మోహన్ రెడ్డి, యరబోలు గోవింద రెడ్డి, మద్దూరు వెంకటరెడ్డి, షేక్ మబ్బుల్, కందుల భాస్కర్ రెడ్డి, బ్రహ్మం, లాలయ్య, నరేంద్ర బాబు, సత్యనారాయణ, పుల్లారెడ్డి, అత్యధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## నిడమనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

- జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్



**నల్లగొండ,సెప్టెంబర్ 17(మనం న్యూస్) :** వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నిడమనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది తో సమావేశం ఏర్పాటు చేసి,సమయ పాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సిబ్బంది విదులపట్ల నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. సిబ్బంది పనితీరు పట్ల సంతృప్త వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టిక, ఓపి రిజిస్టర్ ను, పరిసరాలను పరిశీలించారు. అనంతరం నూతన భవన నిర్మాణ పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. భవన నిర్మాణ పనులను కాంట్రాక్టర్ తో మాట్లాడి పనులు త్వరగా పూర్తి చేయించాలని డాక్టర్ రఫీకి ఆదేశించారు . ఆయన వెంట జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ గీతా వాణి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శంకర్, డాక్టర్ రఫీ, సిహెచ్వోలు రమేష్, మోతిలాల్, పిహెచ్ఎన్ రజిని ,హెల్త్ సూపర్వైజర్ మేరీ స్టెల్లా, సోమయ్య వెంకటరమణ ,జలీల్ పాషా ఏఎన్ఎంలు, ఎంఎల్ హెచ్ పీలు ఆశాలు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సం

**ఆత్మకూర్(ఎం), సెప్టెంబర్ 17 (మనం న్యూస్) :** మండలంలోని కొరటికల్ లో సెప్టెంబర్ 17న ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా పాఠశాలలో జరిగిన వేడుకల్లో స్వతంత్ర భారతదేశ తొలి హోమ్ శాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్ర పటానికి పూలమాల అలంకరించారు. జాతీయ జెండా ఆవిష్కరణ హెచ్ఎం వెంకన్న చేశారు. తదనంతరం ఏపిపీ ఛైర్పర్సన్ మొలుగురి సత్యలక్ష్మి పాల్గొని విద్యార్థులు తెలంగాణ చరిత్ర , అమరవీరుల త్యాగాలు, మహా నాయకుల జీవిత పాఠాలు తప్పక తెలుసుకోవాలని అన్నారు. ప్రజాపాలనలో ప్రతి విద్యార్థి ఎదగాలని కోరారు. నేటి విద్యార్థులే రేపటి నాయకులు కాబట్టి చదువు పట్ల శ్రద్ధ పెట్టాలని, తల్లి దండ్రుల ఆశలు నెరవేర్చాలని కోరారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు స్వామి,శ్రీనివాస చారి,అనురాధ,వెంకటేశంలు పాల్గొన్నారు.

మనం



## దళితబంధుతో లబ్ధిదారులు ఆర్థికాభివృద్ధి చెందాలి

- ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క
- చింతకాని మండలంలో పెండింగ్ ఉన్న 847 కుటుంబాలకు మంజూరు పత్రాలు పంపిణీ
- సిరిపురం గ్రామంలో సోలార్ వ్యవసాయ పంపు సెట్లు పైలెట్ ప్రాజెక్టు క్రింద ఏర్పాటుకు ఎంపిక
- భూమిలేని రైతు కూలీలకు ఈ సంవత్సరం నుంచే ఆర్థిక సహాయం



**ఖమ్మం, సెప్టెంబర్ 17(మనం బ్యూరో):** దళితబంధు పథకాన్ని వినియోగించుకుని లబ్ధిదారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సూచించారు. మంగళవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి, చింతకాని మండలం నాగులవంచ గ్రామంలోని వంకాయలపాటి రామయ్య ఫంక్షన్ హాల్ లో చింతకాని మండల దళితబంధు లబ్ధిదారుల మిగులు నిధుల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకి మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ ప్రజాస్వామ్య స్ఫూర్తితో పని చేసే భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనమైన నేపథ్యంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిరయించిందన్నారు. చింతకాని మండలంలోని దళిత కుటుంబాలన్నింటికి దళిత బంధు పథకం మంజూరులో భాగంగా, 3,462 కుటుంబాలు ఎంపిక చేశామని, మొదటి, రెండవ విడతలో సంపూర్ణంగా దళిత బంధు సాయం అందని 847 కుటుంబాలకు ప్రత్యేక అధికారుల ద్వారా సర్వే చేయించి మంగళవారం 15 కోట్ల 54 లక్షల 32 వేల 629 రూపాయల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వ్యాపారం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని, ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దళిత బంధు యూనిట్స్ ను లబ్ధిదారుల నుంచి కొనడానికి వీలులేదని, బెదిరించి తీసుకువెళ్లడం నేరమని, లబ్ధిదారులను బెదిరించి తీసుకువెళ్లిన యూనిట్స్‌ను తిరిగి తీసుకువచ్చి అప్పగించాల్సిన బాధ్యత ప్రత్యేక అధికారులు, జిల్లా యంత్రాంగం తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు, ఎస్సి, ఎస్టీ లకు రూ. 6 లక్షల ఆర్థిక సహాయం అందించబోతున్నామని పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమై ఉద్యోగులకు వేతనాలు ఇవ్వడానికి పెనుభారమైన ఆనాటి పాలన పరిస్థితులను సరిచేసి ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి ఒకటవ తేదీన ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం నెలల తరబడి పెండింగ్ లో పెట్టిన ఆసుపత్రి మందుల బిల్లులు, కల్యాణ లక్ష్మి, మధ్యాహ్న భోజనం, కార్మికుల గౌరవ వేతనం, హాస్టల్ మెస్ బిల్లుల బకాయిలను ప్రజా ప్రభుత్వం క్లియర్ చేసిందని అన్నారు.గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లు విద్యుత్ ఉచితంగా ఇవ్వడంతో పాటు కొన్ని గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి సోలార్ రూఫ్ టాప్ ద్వారా సౌర విద్యుత్తు ఉత్పత్తి చేసే కార్యక్రమాన్ని చేపడుతున్నామని అన్నారు. దీని ద్వారా ఉత్పత్తైన విద్యుత్తులో గృహ యజమాని వినియోగానికి పోను మిగిలిన విద్యుత్తును ప్రభుత్వం కొనుగోలు చేసి డబ్బులను అందజేస్తుందని అన్నారు. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సోలార్ వ్యవసాయ పంపుసెట్లు తీసుకొస్తున్నామని, సోలార్ వ్యవసాయ పంపు సెట్ల ద్వారా మిగిలిన కరెంటును ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు అదనపు ఆదాయం కల్పిస్తుందని అన్నారు. మధిర నియోజకవర్గం సిరిపురం గ్రామాన్ని సోలార్ వ్యవసాయ పంపు సెట్ల ఏర్పాటుకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. ఈ గ్రామంలోని ప్రతి రైతుకు పూర్తి ప్రభుత్వ ఖర్చుతో సోలార్ వ్యవసాయ పంపు సెట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలలో భాగంగా ఈ సంవత్సరం భూమిలేని నిరుపేదలకు నేరుగా వారి ఖాతాల్లో 12 వేల రూపాయలు జమ చేస్తామని అన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద వచ్చే ఐదు సంవత్సరాల్లో మహిళా సంఘాలకు లక్ష కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణాలు అందించడం జరుగుతుందని తెలిపారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో స్వయం సహాయక సంఘాల సభ్యులను భాగస్వాములు చేసే విధంగా ప్రజా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందని, మహిళా సంఘాల ద్వారా సోలార్ పవర్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, ఈ ప్లాంట్లు ఉత్పత్తి చేసే సోలార్ విద్యుత్తును ప్రభుత్వమే కొనుగోలు చేసి మహిళలకు ఆదాయం సమకూరుస్తుందని అన్నారు. సేంద్రియ వ్యవసాయ సాగును ప్రోత్సహించడంలో భాగంగా చింతకాని మండలానికి పెద్దపీట వేస్తామని, సేంద్రీయ వ్యవసాయ సాగు ద్వారా చేసే ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపించి కొనుగోలు వ్యవస్థను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. శాసనసభ్యుడుగా తనను గెలిపించిన మధిర నియోజకవర్గం ప్రజలు తలెత్తుకునే విధంగా రాష్ట్రంలో పాలన అందించడం జరుగుతుందన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రతిక్షణం పని చేస్తానని. సంపద సృష్టించి, సృష్టించిన సంపద ప్రజలకు అందించడం కోసమే మీ శాసనసభ్యుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పని చేస్తానని తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, చింతకాని మండలంలో సాచురేషన్ మోడ్ లో దళితబంధు పథకం అమలుచేశామన్నారు. అనుభవం ఉన్న యూనిట్ల వైపే లబ్ధిదారులు వెళ్లాలని, పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడాలని అన్నారు. దళితబంధు యూనిట్లు కొనడం, అమ్మడం నేరమని, ఇట్టిదానిపై కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి.శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ విక్రమ్ సింగ్, డిఆర్డీవో సన్యాసయ్య, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, ఇంచార్జ్ ఇడి ఎస్సి కార్పొరేషన్ నవీన్ బాబు, జిల్లా అధికారులు/గ్రామ ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పథంలో తెలంగాణ

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రాజీవ్ ఆరోగ్య శ్రీ సాయాన్ని 10 లక్షలకు పెంపు
- జిల్లాలో 2 వేల 277 మందికి వైద్య సేవలు
- జిల్లాలో 1,37,87,000 మంది మహిళలు ఉచిత ప్రయాణం
- జిల్లాలో 57,983 మంది రైతులకు రూ.415 కోట్ల రుణమాఫీ







**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 17 (మనం ప్రతినిధి):** సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకు వెళుతుందని వ్యవసాయ, సహకార, చేనేత, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రమైన కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల ప్రసంగించారు. సెప్టెంబర్ 17, 1948లో తెలంగాణ నాటి హైదరాబాదు సంస్థానం భారతదేశంలో కలిసి 76 సంవత్సరాలు పూర్తి చేసుకుని 77వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం కాబట్టి ఈ రోజును జిల్లా వ్యాప్తంగా తెలంగాణ ప్రజాపాలన వేడుకలు ఘనంగా నిర్వహించుకుంటున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 1948, సెప్టెంబర్ 17న సువిశాల భారతదేశంలో తెలంగాణ అంతర్భాగమైన రోజు స్వతంత్ర్య భారతావనిలో అరవై ఏండ్ల స్వీయ అస్థిత్వం కోసం, ఉద్యమించి స్వరాష్ట్రంగా అవతరించిన తెలంగాణ నేడు అభివృద్ధి పథంలో ముందంజలో ఉన్నదని చెప్పడానికి చాలా సంతోషంగా ఉంది. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది.

### సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి పథంలో

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దార్శనిక పాలనలో విద్యు త్తు, నీటిపారుదల, వ్యవసాయ, పరిశ్రమలు, ఉద్యోగ ఉపాధికల్పన, అభి వృద్ధి సంక్షేమంతో పాటు ఐటి నుండి అగ్రికల్చర్ వరకు అన్ని రంగాల్లో, గణనీయమైన అభివృద్ధిని సాధిస్తూ అనతికాలంలోనే సంక్షేమ కార్యక్రమాలు అమలులో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నామని చెప్పడానికి చాలా సంతోషంగా ఉంది. తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే రెండు హామీలను అమలుచేసి ప్రజల పట్ల తమకు గల అంకితభావాన్ని చాటుకున్నాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ సేవలను 10 లక్షలకు పెంచడం, రైతు రుణమాఫీ, గృహాజ్యోతి, మహాలక్ష్మి వంటి పథకాలు అమలు పట్ల ప్రజలలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రజాపాలన పేరిట అభయహస్తం గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టి అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీ వార్డులకు అధికారులను పంపి గత సంవత్సరం డిసెంబర్ 28 నుండి జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించాం. సుపరిపాలనపై దృష్టి సారించిన ప్రజా ప్రభుత్వం తొలుత వనరులు, పథకాల అమలుతీరును విశ్లేషించుకుని, ముందుకు సాగుతున్నాము. వాస్తవ పరిస్థిని ప్రజలకు వివరించాలన్న లక్ష్యంతో పారదర్శక పాలన అందించడంలో భాగంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, విద్యుత్ రంగాలపై శ్వేత పత్రాలను విడుదల చేశాం. రాష్ట్రప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెనువెంటనే సచివాలయాన్ని ముళ్ళ కంచెల చెర నుంచి విముక్తి కలిగించి జ్యోతి రావు పూలే నామకరణం చేసి ప్రజల కోసం ద్వారం తెరిచాం.

### ప్రజాపాలన కార్యక్రమం

ఆరు గ్యారంటీలను ఈ రాష్ట్రంలోఉన్న పేదలు, నిరుపేదలను దృష్టిలో పెట్టుకుని మాట ఇవ్వడం జరిగింది. ఈ ఆరు గ్యారంటీలను నిక్కచ్చిగా అమలు చేసి తెలంగాణ ప్రజలకు ఒక సంక్షేమ రాజ్యంగా, అభివృద్ధి రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అహర్నిశలు కృషిచేస్తున్నది. చివరి వరుసలోని పేదలకు కూడా అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందాలనే లక్ష్యంతో ప్రజాపాలన కార్యక్రమం చేపట్టి దరఖాస్తులు స్వీకరించాం. ప్రతి పథకానికి వేర్వేరు దరఖాస్తులు అవసరం లేకుండా ఏ పథకానికి అర్హులైన వారు ఆ పథకానికి దరఖాస్తు చేసేందుకు వీలుగా ఒకే దరఖాస్తును అందుబాటులోకి తెచ్చాం. పరిపాలనను గ్రామాలకు చేర్చాలన్న ప్రభుత్వ ఆలోచన మేరకు గత సంవత్సరం డిసెంబర్ 28 నుండి జనవరి 6వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఒక లక్షా 37 వేల 454 దరఖాస్తులు స్వీకరించాం.

### మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం

మహాలక్ష్మి పథకంద్వారా తెలంగాణ ఆడబిడ్డలు రాష్ట్ర నలుమూలలకు ఎక్కడి నుండి ఎక్కడికైనా అణాపైసా ఖర్చు లేకుండా ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించడానికి అవకాశం కల్పించాం. జిల్లాలో ఇప్పటి వరకు 1 కోటి 37 లక్షల 87 వేల మంది మహిళలు ప్రయాణించగా 71 కోట్ల 91 లక్షల 52 వేల రూపాయలు మహిళలకు ఆదా జరిగింది.

### రాజీవ్ ఆరోగ్య శ్రీ

ఆరోగ్య తెలంగాణగా ఈ రాష్ట్రంఉండాలని, ప్రజలకు మెరుగైన కార్పొరేట్ వైద్య సేవలు అందించేందుకు రాజీవ్ ఆరోగ్య శ్రీ సాయాన్ని 10 లక్షల రూపాయలకు పెంచి అమలు చేస్తున్నాం. జిల్లాలో ఈఏడాది ఏప్రిల్ 1 నుండి ఆగష్టు వరకు 2 వేల 277 మందికి ఈ పథకం ద్వారా వైద్య సేవలు అందించాం. ఇందుకు గాను 7 కోట్ల 8 లక్షల 56 వేల రూపాయలు ఖర్చు చేశాం. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ఇంటింటి జ్వర సర్వే నిర్వహిస్తూ వైద్య సేవలు అందిస్తున్నాం.

### వ్యవసాయశాఖ

దేశానికి పట్టెడు అన్నం పెట్టే అన్నదాత సుఖసంతోషాలతో ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ప్రగాఢంగా విశ్వసించిన ప్రభుత్వం రైతును రుణ విముక్తి చేసేందుకు రుణమాఫి చేపట్టాం. రైతును రాజును చేయడంమా సంకల్పం. రైతు బాగుంటే రాష్ట్రం పచ్చగా ఉంటుందని విశ్వసించే ఈ ప్రభుత్వం రైతుకు రుణభారాన్ని మాఫి చేయడంతో రాష్ట్రం లోని రైతన్నలు నేడు సంతోషంగా ఉన్నారని చెప్పడానికి సంతోషంగా ఉంది. వ్యవసాయానికి 24 గంటల నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నాం. నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపుతున్నాం. విత్తనాలు బ్లాక్ మార్కెట్ చేస్తే పి.డి చట్టం క్రింద కేసులు నమోదు చేస్తున్నాం. అన్ని రకాల పంటల విత్తనాలు, అదేవిధంగా ఎరువులు కొరత లేకుండా సరిపడా నిల్వలు రైతులకు అందుబాటులో ఉంచాం. జిల్లాలో 57 వేల 983 మంది రైతులకు 415 కోట్ల 27 లక్షల, 93 వేల 429 రూపాయలు రుణమాఫి చేసి రైతన్నలకు అప్పుల భాద నుండి విముక్తి కలిగించాం. అన్నదాత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు వార్షిక ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తూ రైతు బీమా అమలు చేస్తున్నాం. జిల్లాలో2023 ఆగష్టు 14, నుండి ఆగష్టు 13, 2024 వరకు 761 మంది రైతులు వివిధ కారణాల వల్ల మరణిం చగా, 673 మంది రైతు కుటుంబాల నామినీల బ్యాంక్ ఖాతాలలో రూ.5 లక్షల చొప్పున రూ. 33 కోట్ల, 65 లక్షలు జమచేయనైనది.

### గృహాజ్యోతి

అల్పాదాయ వర్గాల వారికి విద్యుత్ బిల్లులుభారం తగ్గించి, వారి గృహాలలో చీకట్లను పారద్రోలి, విద్యుత్ కాంతులను నింపేందుకు గృహాజ్యోతి అమలు చేస్తున్నాం. 200 యూనిట్లు కంటే తక్కువ విద్యుత్ వాడే ప్రతి ఇంటికి ఉచిత వెలుగులు అందిస్తున్నాం. ప్రస్తుతం 6 లక్షల పన్నెండు వేల 384 మంది ఈ పథకం ద్వారా లబ్దిపొందుతున్నారు. ఇప్పటి వరకు ఈ పథకానికి 30 కోట్ల 33 లక్షల 28 వేల రూపాలు సబ్సిడి చెల్లించాం.

### మహాలక్ష్మి పథకం

ఆడబిడ్డల కన్నీళ్లు తుడవాలన్న లక్ష్యంతో ప్రారంభించిన పథకం మహాలక్ష్మి. ఈ పథకం ద్వారా 500 రూపాయలకే వంట గ్యాస్ ఇస్తున్నాం. ఈ పథకానికి జిల్లాలో 1 లక్ష 47 వేల 294 మంది లబ్దిదారులను గుర్తించాం. ఇప్పటి వరకు 3లక్షల 52 వేల సిలెండర్లు సరఫరా చేసి 9 కోట్ల 13 లక్షలు సబ్సిడి చెల్లించాం.వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు నియంత్రణకు వ్యక్తిగత పరిశు భ్రత చాలా ముఖ్యం. పరిసరాలు పరిశుభ్రతలో భాగస్వాములైన సిబ్బందిని, ప్రజలను ఈ సందర్భంగా అభినందిస్తున్నాను. పరిసరాలు పరిశుభ్రతతోనే వ్యాధులు దరిచేరని ఆరోగ్య సమాజం రూపుదిద్దుకుంటుంది. ప్రజలు ఆరోగ్య జీవితాన్ని గడిపేందుకు ప్రతి ఇల్లు పరిశభ్రతతో, మొక్కలతో నందనవనం కావాలి. ప్రతి కుటుంబం తప్పనిసరిగా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని కోరుతున్నాను.

### వరద సహాయంలో అధికార యంత్రాంగం నిర్విరామంగా కృషి

సెప్టెంబర్ 1న బంగాళా ఖాతంలో ఏర్పడిన వాయిగుండం వల్ల వచ్చిన భారీ వర్షాలకు మణుగూరు పట్టణం 30 ఏళ్ల చరిత్రలో కనీ వినీ ఎరుగని జలప్రళయానికి గురి అయింది. కట్టవాగు, కొడి పుంజుల వాగు, ఉధృత ప్రవాహం ఫలితంగా మణుగూరు పట్టణం నీట మునిగింది. జిల్లాలో అంజనాపురం, ఉలవనూరులలో కూడా భారీ నష్టం జరిగింది. జిల్లా యంత్రాంగం, ముఖ్యంగా రెవిన్యూ, పంచాయితీశాఖ, మున్సిపల్, వైద్యఆరోగ్య శాఖ, విత్యుత్ శాఖ, అగ్నిమాపక శాఖ, పోలీసు సిబ్బంది అందరు చైతన్యవంతులై ప్రజలను లోతట్టు ప్రాంతల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించడవల్ల ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదు. ముఖ్యంగా గర్భిణీ స్రీలను, 130 మంది చిన్నారులను ఆశ్రమ పాఠశాలలో ఉంచి వారందరికి ఆహారం, వైద్య సేవలు అందించాము. వరదలు తగ్గిన తరువాత అటువ్యాదులు ప్రబలకుండా మున్సిపల్ సిబ్బందిచే పారిశుద్య కార్యక్రమాలు చేపట్టాము. ప్రభుత్వం తక్షణమే స్పందించి జిల్లాలో 2,144 వరదబాధిత కుటుంబాలకు ఆన్లైన్ ద్వారా 16,500 రూపాయల చొప్పున ప్రతికుటుంబానికి పంపనైనది. అన్ని రకాల నష్టాలను సరిచేసే ప్రక్రియ అమలు లో ఉంది. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగపు సేవలను మంత్రి తుమ్మల అభినందించారు మారుమూల గ్రామాలు, నిరుపేదలు నివసిస్తున్న ఈ జిల్లా సమగ్రాభివృద్ధికి నిత్యం కృషి చేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి కి, జిల్లా ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్పీ బిరుదురాజు రోహిత్ రాజు, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజా పాలన దినోత్సవం



- జెండా ఆవిష్కరించిన డిసిసి అధ్యక్షులు

**ఖమ్మం, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో మంగళవారం ప్రజా పాలన దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దుర్గాప్రసాద్ పార్టీ శ్రేణులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ... సెప్టెంబర్ 17 ను ఎలా నిర్వహించుకోవాలనే దానిపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయని, కొందరు వీలినమని, ఇంకొందరు విమోచన దినోత్సవం అని సంబోదిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవంగా ప్రకటించిందని తెలియజేశారు. నాటి నిజాం నవాబుల రాచరిక పాలన నుండి తెలంగాణ ప్రజలు 1948 సెప్టెంబర్ 17 విముక్తి పొందారని, నేడు కెసీఆర్ అనే నయా నిజాం నుండి తెలంగాణ ప్రజలు విముక్తి పొందారని తెలిపారు. నిత్యం ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా ఫరిడ విల్లుతుందని ఆనందం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాలో ఎన్నడూ లేనంతగా మున్నేరు పరివాహక ప్రాంతంలో వరదలు సంభవిస్తే జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు కంటి మీద కునుకు లేకుండా అధికారులను వెంట తిప్పుకుంటూ ఎంతో మంది ప్రాణాలు కాపాడుకోవడం జరిగిందని తెలిపారు. అంతే కాకుండా మున్నేటి పరిసర ప్రాంత ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనుకోని ఉపద్రవం సంభవిస్తే అండగా ఉండాల్సింది పోయి ప్రతిపక్ష నేతలు లేని పోని ఆరోపణలు చేసి పార్టీ ప్రతిష్టను దెబ్బ తీయాలని చూసారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అందేలా చూడటమే తమ కర్తవ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు మహ్మద్ జావేద్, మాజి ఎంఎల్‌సిబాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ మలీదు వేంకటేశ్వర్లు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

### కమ్యూనిస్టు ఉద్యమం కోసం అహర్నిశలు కృషి చేసిన యర్రా వెంకన్న

**ఖమ్మం, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వార్షికోత్సవాల సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అమరజీవి యర్రా వెంకన్న 40వ వర్ధంతి సందర్భంగా ఖమ్మం త్రీటౌన్ ప్రజా సంఘాల కార్యాలయంలో సభ నిర్వహించారు. ఈ సభలో సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో 1946 నుండి 1951 వరకు కమ్యూనిస్టుల నాయకత్వంలో ప్రజాసైన్యం ఏర్పడి వీరోచితంగా పోరాటం జరిపిందని, భూ పంపిణీ జరిగిందని, బానిస వెట్టి చాకిరి నుండి విముక్తి జరిగిందని, 1948 సెప్టెంబర్ 17న భారతదేశంలో విలీనం అయిందని అన్నారు. యర్రా వెంకన్న తెలంగాణ సాయుధ పోరాటంలో మంచి కంటి, చిర్రావూరి నాయకత్వంలో దళాల్లో పనిచేసి జైలుకు వెళ్లి అనేక నిర్బంధాలను ఎదుర్కొని కమ్యూనిస్టు ఉద్యమం కోసం అహర్నిశలు కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, త్రీటౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాసరావు, సిపిఎం సీనియర్ నాయకులు వజినేపల్లి శ్రీనివాసరావు, బండారు యాకయ్య, ఎస్కే.సైదులు, 35వ డివిజన్ కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, పత్తిపాక నాగ సులోచన, శీలంవీర బాబు, యర్రా మల్లికార్జున్, యర్రా నగేష్, సాయికుమార్, హెచ్ పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# నరేంద్ర మోదీ రక్షా దేశానికి శ్రీరక్ష

- ప్రధాని మోడీ జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరం




**ఖమ్మం,సెప్టెంబర్17(మనం న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్రమోదీ 74 వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సేవా పక్షోత్సవాలు' కార్యక్రమం లో భాగంగాభారతీయ జనతా యువమోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ నవ భారత నిర్మాత, స్వామి వివేకానంద వారసులు ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా జిల్లాలో తల సేమియా వ్యాధిగ్రస్తులకు బీజేవైఎం ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. సంక్షేమ పథకాలు (సబ్కా సాత్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్ ,సబ్కా ప్రయాస్ ) సిద్ధాంతంతో చిట్ట చివరన ఉన్నటువంటి పేదవాళ్లకు అందడం నరేంద్ర మోడీ కృషి అన్నారు. బి.జే. వై.ఎం. జిల్లా అధ్యక్షులు అనంతు ఉపేందర్ మాట్లాడుతూ, కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఏర్పడిన తర్వాత దేశ ప్రజల అవసరాల మేరకు అనేక బిల్లులను ప్రవేశపెట్టిన ఏకై క ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. రక్తదాన శిబిరానికి సహకరించిన జిల్లా పార్టీ అధ్య క్షులు గల్లా సత్యనారాయణ కి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందికి ప్రత్యక ధన్యవా దాలు తెలి పారు. ఈ రక్తదాన శిబిరంలో బీజేపీ రాష్ట్ర నాయకులు సాగర్, మంద సరస్వతి ,జి. శ్యామ్ రాథోడ్, అల్లిక అంజయ్య, బోయినపల్లి చంద్రశేఖర్, నెల్లూరు కోటేశ్వరరావు, యార్లగడ్డ రాఘవేంద్రరావు, రవి రాథోడ్, మోహన్ రాథోడ్, రవితే జ,డి. కొండ శ్యామ్ శ్రీకాంత్ కోటేశ్వరరావు,బోయినపల్లి ప్రభాకర్, వెంకటేష్, దాస్, బాణ్య నాయక్, మధు తదితరులు పాల్గొన్నారు

# ఆదరణ కరువైన మేదరులు

- రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి
- ఎన్నో గృహోపకరణాల సృష్టికర్తలు
- దయనీయంగా మేదరి బతుకులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి
- మేదర జాతి అవస్థలపై మనం ప్రత్యేక కథనం....

**జమ్మికుంట, సెప్టెంబర్ 17( మనం న్యూస్):** మానవ జీవన మనుగడలో కష్టాన్నే నమ్ముకుని బ్రతుకుతున్న కొందరిలో మేదర కులస్తులు ఒకరు. తెల్లవారుజామునే లేచి సద్దికట్టుకుని కారడవిలో తమ జీవన మనుగడకు ప్రధాన వనరు అయిన వెదురు కలప కోసం సమీప అటవీ గ్రామాల ప్రజలు కిలోమీటర్ల మేర కాలినడకతో ప్రయాణమై కుటుంబ సంరక్షణ కోసం వెదురు కలపను తీసుకువచ్చి అనేక గృహోపకరాలు తయారుచేస్తూ జీవనం సాగించేవారే మేదరులు. తరతరాలుగా కులవృత్తిని నమ్ముకుని బ్రతుకుబండిని నెట్టుకువస్తున్న వీరికి ప్రభుత్వ ఆదరణ పూర్తిగా కరువైందని చెప్పుకోవచ్చు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 95 వేల కుటుంబాలు,1,50,000 మంది మేదరి కులస్తులు వెదురు కలప ఆధారంతోనే జీవనం సాగిస్తున్నాయి. మార్కెట్లోకి విదేశీ గృహోపకారాలు ,ప్లాస్టిక్ వసువులు రావడంతో వీరి ఉపాధి కుంటుపడింది. దీంతో కులవృత్తిని పక్కకు పెట్టి కూలీ పనులకు వలస పోతున్న పరిస్థితి ఏర్పడింది. నైపుణ్యానికి ప్రభుత్వం గుర్తించి సరైన సంక్షేమాన్ని అందిస్తే తమ జీవితాల్లో కూడా వెలుగులు నిండుతాయని మెదరుల ఆకాంక్ష, వెదురు లేదా గడ అనే మొక్కలు మానవ గృహ అవసరాలు. నిర్మాణాలకు అత్యధికంగా వినియోగించుకునే వృక్షజాతీ, వెదురు ఉష్ణ ప్రదేశాలలో నిటారుగా పెరిగే గడ్డి జాతి కి చెందినది.భూమ్మీద అతి తొందరగా పెరిగే గడ్డి జాతి మొక్క వెదురు మాత్రమే వెదురును నమ్ముకుని జీవనం సాగిస్తున్న మేదరుల అవస్థలు కడు దయనీయం.

## గృహోపకరణాల సృష్టికర్తలు..

మానవ గృహ అవసరాలకు అనేక రకాలుగా వెదురు ఉపయోగపడుతుంది. ఇళ్లు కట్టుకోవడానికి, నిచ్చెనలు, బల్లలు, కుర్చీలు, తట్టలు, బుట్టలు, అనేక రకాల గృహ ఉపయోగకర వస్తువులకు విశేషంగా ఉపయోగిస్తుంటారు. కాగితం తయారిలో గుజ్జును తయారు చేయడానికి దీన్ని వాడుతారు. అదేవిధంగా ఆయుర్వేద వైద్యానికి, సంగీత వాయిద్యాల తయారీలో ఇళ్ళనిర్మానంలో, అలంకరణ సామాగ్రిగా వెదురును ఉపయోగిస్తారు. ఈ



రోజుల్లో వెదురుతో చేస్తున్న ఇంటీరియల్ ఆర్ట్ పీసులు అందరి ఇళ్ళలోనూ ఎంతో శోభని చేకూరుస్తున్నాయి. బెడ్ల్యాంప్లు, చేతి బ్యాగులు, అనేక రకాల ఫోటో ఫ్రేమ్లు, పూల సజ్జలు, వాల్ హ్యాం గర్లు, బట్టలు బట్టలు, వెదురు కుర్చీలు, ఉయ్యాల బల్లలు, పెన్సింగులు వంటివి నగరాల్లోనే కాక, గ్రామీణ ప్రాంతాల్లో కూడా డిమాండ్ కలిగి ఉన్నాయి..

## గిరిజనులు దేవతగా ఆరాధించే వృక్షం..

ఏజెన్సీలోని గిరిజనులు వెదురు చెట్లను ఆరాధ్య దైవంగా పూజిస్తారు. కొందరు కొండతెగకు చెందిన గిరిజనులు వెదురు చిగుళ్ళను ఊరగాయ పెట్టుకుంటారు. అటవి తెగలు వెదురు గింజలతో కల్లు, సారా యిలను తయారుచేస్తారు. ఒక్క రంగు మినహా గోరు మలను పోలిఉండే వెదురు గింజలను దంచిపై పొట్టు తీసి రొట్టెలు తయారుచేస్తారు. అదేవిధంగా వెదురును అనేక వైద్య సంబంధ కార్యక్రమాలకు వెదురు చాలా బాగా ఉపయోగపడుతుందనేది వారి నమ్మకం. వెదురు చిగుళ్ల కషాయం చలువ చేయడంతో పాటు, రక్తదోషం, మూల వ్యాధి, మధు మేహం లాంటివ్యాధులకు ఉపయోగపడు తుంది. స్త్రీలకు గర్భకోశమును శుభ్రం. చేయుటకు ఆకలి పుట్టుటకు దీని కషాయాన్ని వారు సేవిస్తారు. అదేవిధంగా ఆయుర్వేదంలో అనేక ఉదర వ్యాధులకు వెదురును ఉపయోగిస్తారని తెలుస్తోంది.

## ప్రభుత్వం మేదరులను ఆదుకోవాలి...

తెలంగాణ ప్రభుత్వం ఉపాధి, ఉనికి కోల్పోతున్నా మేదర కులస్తులను ఆదుకుని వారికి మేదరి బంధు పథకాన్ని అమలుచేయాలని.కేవలం వెదురు కలపను ఆధారంగా చేసుకుని జీవనం కొనసాగిస్తున్న మేధారులను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. జనజీవనంలో ఉపయోగపడే అనేక రకాల వస్తువులను తయారుచేస్తూ జీవనం గడిపే ప్రత్యేకత కలిగిన మేదరి కులస్థులను ఆదుకోవాలని, చేతి వృత్తుల మనుగడను కాపాడాలని కోరారు.



తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ వివిధ కులాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ కులవృత్తులను ప్రోత్సహిస్తూ మేదరులంపై చిన్న చూపు చూడడం కడు విచారకరమని కనుమరుగవుతున్న మేదరి వృత్తిని ప్రోత్సహించి మేదరులకు తగు న్యాయం చేయాలని అలాగే హరితహారం లో భాగంగా వెదురు మొక్కలను నాటి మేదరులకు జీవనోపాధి కలిగించే వెదురువనాలను కాళీ ప్రభుత్వ భూములు పెంచినట్లయితే అటవీ విస్తీర్ణం పెరగడమే కాకుండా పర్యావరణ పరిరక్షణ మెరుగుపరిచినట్లు అవుతుందని హరితహారం లక్ష్యం కూడా నెరవేరుతుందని పలువురు మేధావులు అంటున్నారు.

## మనిషి జీవితంతో ముడిపడిన వస్తువులు మేధారులవే...

మనిషి జీవితం మొదలైన కాడి నుండి చివరి అంత్యక్రియల వరకు మేదరి కులస్తులు తయారుచేసే వస్తువుల పైన మనిషి జీవితం ఆధారపడి ఉంటుంది.మనిషి జీవితంలో అన్నం వండుకోవడానికి కావలసిన బియ్యాన్ని శుభ్రం చేయడానికి ఉపయోగించే చాట ,పెళ్లిలో పొలు పోయడానికి వాడే గంపలు ,మనిషి జీవితంలో దేవుని అవసరాలకు వాడే కేదారేశ్వర వ్రతం దుర్గమ్మ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాలలో వాడే చిబ్బులను కూడా మేదర్లే తయారుచేస్తారు అలాగే అంతిమయాత్రలో ఉపయోగించే కర్రలను కూడా మేదరులే ఇవ్వడం గమనార్హం. ఇలా మనిషి దైనందిన జీవితంలో ఉపయోగించే వస్తువులను తయారు చేసే సృష్టికర్తలుగా పేరుగాంచిన మేదరుల స్థితిగతులను ప్రభుత్వం గుర్తించి అన్ని విధాలుగా ఆదుకోవాలని మేధావులు మేదరులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుచున్నారు.

# ప్రజా పాలన ద్వారా అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రభుత్వం కృషి



- ప్రభుత్వ సలహాదారు అరకర వేణుగోపాల్ రావు

**మంచిర్యాల, సెప్టెంబర్ 17(మనం న్యూస్) :** ప్రజా పాలన ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని చివరి వరసలోని పేదలకు కూడా ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు ఫలాలు అందాలనే లక్ష్యంతో ప్రజాపాలన చేపట్టినట్లు ప్రభుత్వ సలహాదారు అరకర వేణుగోపాల్ రావు అన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజాపాలన దినోత్సవ వేడుకలను మంచిర్యాల జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం, నస్పూర్ లో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతితిగా పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశంలో తెలంగాణ అంతర్భాగమైన రోజు స్వతంత్ర భారత 67 ఏళ్ల అశ్విత్వం కోసం ఉద్యమించి స్వరాష్ట్రంగ అవతరించిన తెలంగాణ, నేడు అభివృద్ధి పథంలో ముందంజలో ఉందని చెప్పడానికి చాలా సంతోషంగా గర్వంగా ఉందని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువైన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనిక పాలనలో విద్యుత్తు ,నీటిపారుదల వ్యవసాయం, పరిశ్రమలు, ఉద్యోగ ,ఉపాధి కల్పన ,అభివృద్ధి సంక్షేమలతో పాటు అన్ని రంగాల్లో గణనీయ మైన అభివృద్ధి కాలంలోనే సంక్షేమ కార్యక్రమాలలో అమలులో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నామని చెప్పడానికి గర్విస్తున్నట్లు తెలిపారు 1948 వ సంవత్సరం సెప్టెంబర్ 17వ న తెలంగాణ రాష్ట్రం విశాల భారత దేశంలో అంతర్భాగంగా మారిందని రాచరికం పరిపాలన నుంచి ప్రజాస్వామ్య దశలోకి పరివర్తన చెందిన రోజున మన రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజా పరిపాలన దినోత్సవం గా రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నదని ఆనాటి ఉజ్వల ఉద్యమ సందర్భం తెలంగాణ కీర్తి కిరీటంలో కలికితురాయిగా నిలిచి పోయిందని, అద్భుత ఘట్టాలు, జ్ఞాపకాల్లో నిత్యం ప్రకాశిస్తూనే ఉంటాయని శిరస్మరణీయులైన ఆనాటి వీరులందరిరని పేరు పేరునా తలచు కోవడం మన విధి, కర్తవ్యమని అన్నారు రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఇచ్చిన మేరకు అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే రెండు హామీలను ఆ తర్వాత అన్ని హామీలను నిర్వహించడం జరిగిందని, ప్రజా పాలన పేరిట అభయహస్తం , గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టి అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీ వార్డులకు అధికారులను పంపి దరఖాస్తులను స్వీకరించామని సుపరిపాలంపై దృష్టి సారించినట్లు తెలిపారు వ్యవసాయ రంగానికి ప్రభుత్వం తీసుకున్న ఉద్దీపన చర్యల వల్ల వ్యవసాయం విస్తరించిందని రైతులకు రుణమాఫీ, రైతుబిమా వంటి పథకాల అమలుతో రైతుల గుండెల్లో విశ్వాసం నింపిందన్నారు. తెలంగాణ దేశానికి అన్నం పెట్టి అన్నపూర్ణంగా అవతరిస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని మంచిర్యాల జిల్లాల్లో 2023 -24 యాసంగికి సంబంధించి 26,790 మంది రైతుల మధ్య నుంచి 1,55 మెట్లు కొనుగోలు చేసి 338 కోట్ల 65 లక్షల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని, మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలోని ఆడపడుచులకు, ట్రాన్స్జర్లకు ఆర్టీసీ బస్సులో సౌకర్యాన్ని కల్పించామని జిల్లాలో ఇప్పటివరకు 6 లక్షల 5,39 మంది ఈ ఉచిత రవాణాను ఉపయోగించుకున్నారన్నారని దీని ద్వారా మహిళలకు రెండు కోట్ల 43 లక్షల 38వేల 83 రూపాయల లబ్ధి చేకూరిందని తెలిపారు మంచిర్యాల జిల్లాలో ఒక లక్ష 1721 మంది లబ్ధిదారులకు సబ్సిడీ సిలండరు 500 రూపాయలకు అందిస్తున్నట్లు 2లక్షల 59 వేల 190 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసామని , వైద్య పరిమితిని ఐదు లక్షల 10 లక్షల పెంచి అమలు చేస్తున్నామని ఈ పథకం వల్ల మంచిర్యాల జిల్లాలో 5840 మంది పేదలకు చికిత్సలు పొందారని అన్నారు గృహ జ్యోతి పథకం ద్వారా మంచిర్యాల జిల్లాలో వినియోగదారులకు విద్యుత్ బిల్లుల భారం తగ్గించడం జరిగిందని , 200 యూనిట్లు లోపు విద్యుత్ వినియోగ దాలకు ఉచితంగా విద్యుత్ ఇస్తున్నామని ఈ జిల్లాలో మార్చి 24 నుంచి ఆగస్టు 20 24 వరకు 6,18,42 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం 23 కోట్ల 73 లక్షల రూపాయల రాయితీ అందజేసిందన్నారు. రుణమాఫీ ద్వారా 557 మంది రైతన్నలకు 462 కోట్ల రూపాయల రుణమాఫీ జరిగిందన్నారు. వర్షాకాలం సీజన్లో వ్యాధులు నియంత్రణకు వ్యక్తిగత పరిశుద్ధ చాలా ముఖ్యమని పారిశుధ్యంలో భాగస్వామ్యలను సిబ్బందిని ప్రజలను ఈ సందర్భంగా అభయందిస్తున్నట్లు తెలిపారు పరుశురాలు ఆరోగ్య సమాజం రూపొందించుకుంటుందని గ్రామస్థాయి నుంచి ఆరుగుకరమైన సమతుల్య వాతావరణం పెంపొందించుకోవాలని అన్నారు మంచిర్యాల జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న 45 ఏళ్ల సంబంధిత బాధితులకు 13 లక్షల 9 వేల రూపాయల నష్టపరిహారము మంజూరు చేయడం జరిగిందని, అంతేకాకుండా వరదల వలన మృతి చెందిన ఎనిమిది పశువులకు నాలుగు లక్షల రూపాయలు నష్టపరిహారం బాధితులకు ఇవ్వడం జరిగిందని వరద ప్రాముఖ్యత ప్రాంతాల్లో ప్రజల రక్షణ కోసం అధికార యంత్రాంగం విద్యుత్ ప్రాతిపదికన చర్యలు చేపట్టి ఎలాంటి ప్రాణస్టం వాటిల్లకుండా ముందస్తు అప్రమత్తంగా చర్యలు తీసుకుందని తక్షణ సహాయ చర్యలకు మూడు కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. మంచిర్యాల జిల్లా సమగ్ర అభివృద్ధికి నిత్యం కృషి చేస్తున్న పార్లమెంటు శాసనసభ్యులు శాసనమండలి జిల్లా కలెక్టర్ అధికార యంత్రానంగానికి స్థానిక ప్రజాప్రతినిధులకు జిల్లా ప్రజలకు పాత్రికేయ మిత్రులకు అందరికీ ధన్యవాదా లన్నారు. ఈ ప్రజా పాలనా దినోత్సవ వేడుకల కార్యక్రమంలో మంచిర్యాల,బెల్లంపల్లి ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్సాగర్ రావు ,గడ్డం వినోద్, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచాల డిప్యూటీ కమిషనర్ ఏ భాస్కర్, రాష్ట్ర మినిమమ్ వేజెస్ అడ్వైజరీ బోర్డు ఛైర్మన్ బి.జనక్ ప్రసాద్ అదనపు కలెక్టర్లు సబావత్ మోతిలాల్ ,డీసీపీలు, ఏసీపీలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పటేల్ కృషితో తెలంగాణకు విముక్తి



**మంచిర్యాల ,సెప్టెంబర్ 17 ( మనం న్యూస్):** సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషితో తెలంగాణకు విముక్తి కలిగిందని బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి అన్నార్తు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా మంగళవారం బీజేపీ మంచిర్యాల జిల్లా కార్యాలయం, అర్చన టెక్స్ చౌరస్తాలో బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆనాడు భారత దేశానిక్ స్వాతంత్ర్యం వచ్చిన హైదరాబాద్ రాష్ట్రంలో కొనసాగుతున్న నిజాం, రజాకర్ల పాలనను పోలీస్ చర్యతో నిజాం నిరంకుశ పాలనను అంతం అందించి హైదరాబాద్ రాష్ట్రానికి విముక్తి కల్పించి స్వాతంత్ర్యం అందించడం జరిగిందని, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అధ్వర్యంలో తెలంగాణ విమోచన వేడుకలు అధికారికంగా ప్రతి సంవత్సరం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజనీష్ జైన్, పట్టి వెంకట కృష్ణ, బింగి ప్రవీణ్, జోగుల శ్రీదేవి, బొద్దున మల్లేష్, ముదాం మల్లేష్, నాగుల రాజన్న, వైద్య శ్రీధర్, అమీరిశెట్టి రాజు, బండి మలికార్జున్, బోయిని దేవేందర్, అర్నక్కండ శ్రీనివాస్, ఎల్కపల్లి పవన్, కల్వచర్ల అనిల్ మరియు తతిదరులు పాల్గొన్నారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోని మాత శిశు వార్డులో బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి , బీజేపీ నాయకులు పండ్ల పంపిణీ చేశారు.

## టిజిఓ ఆధ్వర్యంలో ప్రజాపాలన దినోత్సవం

**ఖమ్మం, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక భవనంలో ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రి, అసోసియేట్ అధ్యక్షులు వాసిరెడ్డి శ్రీనివాస్, తెలంగాణ జూనియర్ కాలేజ్ రాష్ట్ర అధ్యక్షులు కొప్పు శెట్టి సురేష్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి డాక్టర్ హరీష్, జిల్లా బాధ్యులు ఫణి కుమార్, ఆంతోటి తిరుపతరావు, కిరీటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

- జాతీయ జెండాను ఆవిష్కరించిన మేయర్, సునీల్ రావు

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 17 (మనం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం మీద ఉన్న ప్రజల నమ్మకం పోకూడదంటే తప్పకుండ ప్రకటించిన పథకాలన్ని ప్రజలకు చేరాలని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. సెప్టెంబర్ 17 ను ప్రజాపాలన దినోత్సవంగా జరుపుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మేయర్ యాదగిరి సునీల్ రావు హాజరై కమీష్ణనర్ చాహాత్ బాజ్ పాయ్, పాలకవర్గ సభ్యులతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రెప రెప వాడుతున్న మువ్వన్నెల జెండాకు గౌరవ వందనం చేస్తూ జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా నగర మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ప్రజాపాలన అందించాలని తీసుకున్న లక్ష్యం ప్రకారం ప్రజా పాలన ద్వారా రాష్ట్రం ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా ప్రభుత్వ నిర్ణయాలు ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలు ఎంతో ఆశతో ప్రజాపాలన లో ప్రభుత్వానికి అందించిన ధరఖాస్తులను, అర్జీలను పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ప్రజలు ప్రభుత్వం పెట్టుకున్న నమ్మకం వమ్ము కాకుండా చేపట్టిన పథకాలు ప్రతి పేదవాడికి చేరాలని సూచించారు. ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు చేరినప్పుడే ప్రజాపాలన ఉద్దేశం నెరవేరుతుందని తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు దిగ్విజయంగా కొనసాగి అర్హులైన పేదలకు వాటి ఫలా లు పూర్తి స్థాయిలో అందాలని కోరారు. ప్రజలకు ప్రభుత్వాల మీద ఉన్న ఆశలు నమ్మ కాలు అంతా ఇంతా కాదని ప్రభుత్వం మీద పెట్టుకున్న ఆశలు ఆడియాశలు కాకుండ తెలంగాణ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపి ప్రతి సంక్షేమం ప్రజలకు చేరేలే సుపరిపాలన అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ పాలకవర్గ సభ్యులు



గుగ్గిల్ల జయశ్రీ శ్రీనివాస్, గంట కళ్యాణీ శ్రీనివాస్, అర్ష కిరణ్మయి మల్లేషం, ఆకుల నర్మద నర్సయ్య, కోల మాలతి సంపత్, కంసాల శ్రీనివాస్, వాల రమణ రావు, అడిషనల్ కమీషనర్ సువార్త, డిప్యూటీ కమీషనర్ స్వరూప రాణీ, అసిస్టెంట్ కమీషనర్ వేణు మాధవ్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, సానిటేషన్, రెవెన్యూ విభాగాల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి పేదవాడికి అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

- రైతన్నలకు రూ. 2 లక్షల వరకూ రుణ మాఫీ
- 500 కే వంటగ్యాస్ సిలిండర్ పంపిణీ
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- ఘనంగా ప్రజాపాలన వేడుకలు



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 17 (మనం న్యూస్) :** ఆరు గ్యారంటీలను నిక్కచ్చిగా అమలు చేసి, తెలంగాణను తీర్చి దిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తున్నదని,ప్రతి పేదవాడికి అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందాలనే లక్ష్యంతో, ప్రజాపాలన కార్యక్రమం చేపట్టి దరఖాస్తులు స్వీకరించామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.మంగళవారం నగరంలోని పోలీస్ పేరడ్ గ్రౌండ్ లో తెలంగాణ ప్రజాపాలన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జెండా ఎగురవేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సెప్టెంబర్ 17, 1948 సంవత్సరంలో తెలంగాణ నిజాం చెర నుండి విముక్తి పొంది, అఖండ భారత్లో విలీనమైందన్నారు. సెప్టెంబరు 17వ తేదీని 'తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవం'గా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిరణయించిందని,రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ప్రజాపాలన వేడుకలు ఘనంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు.ఆనాటి వీరయోధులైన కొమరం భీమ్, దొడ్డి కొమురయ్య, రావి నారాయణ రెడ్డి, స్వామి రామానంద తీర్థ, సర్దార్ జమలాపురం కేశవరావు, వట్టికోట ఆళ్వార్ స్వామి, చాకలి ఐలమ్మ, భీంరెడ్డి నర్సింహా రెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, బదడం ఎల్లారెడ్డి, సురవరంప్రతాపరెడ్డి, ప్రజాకవి కాళోజీ, మగ్దూం మొహియొద్దీన్, షోయబుల్లాఖాన్, బండి యాదగిరి, దాశరథి కృష్ణమాచార్య, సుద్దాల హనుమంతు ఇంకా ఎందరో మహానుభావులు వారందరికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని అన్నారు. ఆడబిడ్డలకు రాష్ట్ర నలుమూలలకు ఎక్కడి నుండి ఎక్కడికైనా అణాపైసా ఖర్చు లేకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడానికి అవకాశం కల్పించామన్నారు. దీని ద్వారా మహిళలకు 79 కోట్ల 90 లక్షల 49 వేల రూపాయల లబ్ది చేకూరిందన్నారు.రాష్ట్రంలో నిరుపేదలు సైతం కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లి ఖరీదైన వైద్యాన్ని పొందాలన్న లక్ష్యంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ సాయాన్ని 5 లక్షల నుండి 10 లక్షల రూపాయలకు పెంచి అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ పథకం వల్ల మన జిల్లాలో 15 వేల 302 మంది పేదలకు ఉచిత చికిత్స అందించామన్నారు.ఆడబిడ్డల కన్నీళ్లు తుడవాలన్న లక్ష్యంతో ప్రారంభించిందే మహాలక్ష్మి పథకంలోని మరో పథకం రూ. 500 రూపాయలకే వంట గ్యాస్ అందిస్తున్నామని తెలిపారు . ఈ పథకం కింద మన జిల్లాలో 1 లక్ష 43 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు.అల్పాదాయ వర్గాల వారికి విద్యుత్ బిల్లుల భారం తగ్గించి, వారి గృహాలలో చీకట్లను పారద్రోలి విద్యుత్ కాంతులను నింపేందుకు గృహజ్యోతి పథకం అమలు చేస్తున్నామని తెలిపారు .జిల్లాలో ఇప్పటివరకూ 1 లక్షా 62 వేల 895 కుటుంబాలకు ఈ పథకంతో లబి చేకూరుతోందన్నారు.పేద, బడుగు వర్గాల స్వంత ఇంటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో నూతన గృహ నిర్మాణ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పథకం ద్వారా ప్రతీ నియోజకవర్గంలో కనీసం 3 వేల 500 ఇండ్ల చొప్పున నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. రుణ మాఫీతో తెలంగాణలో రైతులు రుణ విముక్తులై స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నారని తెలిపారు.మన జిల్లాలో 71 వేల 109 మంది రైతుల ఖాతాలలో రుణమాఫీ కింద రూ. 546 కోట్ల 36 లక్షల 78 వేల 695 రూపాయలను రుణ మాఫీ చేయడం జరిగిందన్నారు.అర్హులైన రైతులందరికీ రైతు భరోసా పథకాన్ని ఎకరానికి 15 వేల రూపాయల చొప్పున అందించాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.రాష్ట్రంలో వరి సాగు చాలా విస్తారంగా జరుగుతోందని పండిన పంటకు సరైన గిట్టుబాటు ధర రాక రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారని, సన్నరకం వరి ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతులకు పంటల బీమా పథకం వర్తింపచేయడానికి ఈ సంవత్సరం నుంచి ఫసల్ బీమా యోజన పథకంలో చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు . ఈ పథకం కింద రైతుల తరఫున బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. తెలంగాణలో విద్యా వ్యవస్థను మెరుగు పరచడానికి తెలంగాణ విద్యా కమిషన్ ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు .పాఠశాలలు తెరిచిన రోజునే పిల్లలందరికీ యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు అందజేశామని . అమ్మ ఆదర్శపాఠశాలల కమిటీల ద్వారా మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం ప్రతి నియోజకవర్గంలో ఒకే ఆవరణలో 25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లను నిర్మించబోతున్నామని తెలిపారు.

## ఘనంగా విశ్వకర్మ జయంతి



**రామకృష్ణాపూర్,సెప్టెంబర్ 17 (మనం న్యూస్):** విశ్వ కర్మ జయంతి సందర్భంగా రామకృష్ణాపూర్ పట్టణ విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పోతులూరి వీర బ్రహ్మం దేవాలయంలో యజ్ఞ మహోత్సవం,పతాక ఆవిష్కరణ,విశ్వకర్మ పూజ నిర్వహించారు. అనంతరం పట్టణంలో విశ్వకర్మ రథ యాత్ర నిర్వహించి ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూల మాలలు వేశారు.ఈ కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్,ఉపాధ్యక్షులు ఉమ్మిడి భిక్షపతి, మాచెనపల్లి వెంకట రమణ,పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు రంగు సత్యనా రాయణ,ఊట్ల వెంకటాచారి,గుగ్గిల్ల సాంబమూర్తి,క్రిష్ణ మూర్తి,నాగరాజు, సత్యం,శ్రీనివాస్ తదిత రులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ డీలర్లకు అవగాహన సదస్సు



**మహాదేవపూర్, సెప్టెంబర్ 17(మనం న్యూస్) :** మహదేవపూర్ పలిమెల మండలాలకు చెందిన పర్టిలైజర్ డీలర్ల కు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం నాడు మహదేవపూర్ రైతువేదికలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచలకులు శ్రీపాల్ మాట్లాడుతూ రెండు మండలాలకు చెందిన డీలర్లు స్టాక్ రిజిస్టర్స్ ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తు ఉండాలని రైతులు కొనుగోలు చేసిన ఎరువుల మందులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ఎరువులను ఎక్కువ ధరలకు అమ్మకం జరిపితే చర్యలు తప్పవని అన్నారు.ఇతర రాష్ట్రాలకు ఎరువులను సరఫరా చేయరాదన్నారు.సీడ్స్ మరియు ఫర్టిలైజర్ యాక్ట్ నిబంధనల ప్రకారం ఎరువుల దుకాణాలు నిర్వహించాలని నిబంధనలు అతిక్రమించిన ఎరువుల దుకాణాల పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుధాకర్,ఏ ఈ ఓ ధర్మేందర్, ఫర్టిలైజర్ డీలర్స్ అధ్యక్షుడు అశోక్ ,జగదీశ్వర్ వెంకటరెడ్డి,సంపత్ తోపాటు రెండు మండలాల డీలర్లు పాల్గొన్నారు.

## వైభవంగా గోదావరి హారతి



**కాళేశ్వరం,సెప్టెంబర్ 17(మనం న్యూస్) :** పవిత్ర పుణ్య క్షేత్రం కాళేశ్వరం లో త్రివేణి సంగమ గోదావరి నదికి హారతి కార్యక్రమం మంగళవారం నాడు నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కమీషనర్ ఆదేశాల మేరకు ప్రతి నెల పౌర్ణమి రోజున గోదావరి నదీ హారతి కార్యక్రమం నిర్వహించటం ఆనవాయితీ. . అందులో భాగంగా మంగళవారం పౌర్ణమి సందర్భంగా ముఖ్య అర్చకు లు పనకంటి ఫణీంద్ర శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చక స్వాములు కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం నుండి మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలతో, గోదావరి నది వద్దకు వెల్లి గోదావరి నదీ హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. . ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెంట్ బుర్రి శ్రీనివాస్ , మాజీ ధర్మకర్త శ్యాంసుందర్ దేవుడా, దేవస్థానం సిబ్బంది, గ్రామస్తులు ,భకులు, మహిళలు, పాల్గొన్నారు.

## ఘనంగా ప్రజా పాలన దినోత్సవం



**మహాదేవపూర్,సెప్టెంబర్ 17,(మనం న్యూస్) :** ప్రజా పరిపాలన దినోత్సవం ను పురస్కరించుకొని మహాదేవపూర్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ కే వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయితీ కార్యాలయం లో స్పెషల్ అధికారి డి ఎల్ పి ఓ ఎం వీరభద్రయ్య జాతీయ జెండా ఆవిష్కరించారు. స్వచ్ఛ హి సేవా కార్యక్రమం లో భాగంగా కార్యాలయ సిబ్బంది స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు, నాటుదాం చెట్టు అమ్మకోసం కార్యక్రమం లో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం లో మండల పరిషత్, తహసీల్దార్, కార్యాలయసిబ్బంది, ఐ కేపీ మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం



**మహాదేవపూర్, సెప్టెంబర్ 17(మనం న్యూస్) :** తెలంగాణా విమోచన దినోత్సవాన్ని మహాదేవపూర్ మండల కేంద్రంలో తుఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణా అమరులకు ఘనంగా నివాళులు అర్పించారు,ఈ కార్యక్రమంలో డాక్టర్ అయుబొద్దిన్, అంకారి ప్రభాకర్, వామన్ రావు, ఇర్షాద్ అహ్మద్, ప్రవీణ్ కుమార్ , జాడి గట్టయ్య తదితరులు పాల్గోన్నారు.

## ఘనంగా ప్రజా పాలన దినోత్సవం



**మహా ముత్తారం,సెప్టెంబర్ 17 (మనం న్యూస్) :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. తహ సీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కార్యాలయంలో మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు.

# అభివృద్ధి, సంక్షేమం జోడెడ్ల లాంటివి

**భూపాలపల్లి, సెప్టెంబర్ 17(మనం న్యూస్) :** రాష్ట్రంలో పాలన సాగిస్తున్న ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం జోడెడ్ల ల సాగిస్తుందని రాష్ట్ర అటవీ, అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పొదెం వీరయ్య తెలిపారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. సెప్టెంబర్ 17, 1948లో తెలంగాణ నాటి హైదరాబాదు సంస్థానం భారతదేశంలో ఐక్యమై 76 సంవత్సరాలు పూర్తి చేసుకుని 77వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజును తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా తెలంగాణ ప్రజాపాలన వేడుకలు ఘనంగా నిర్వహించుకుంటున్నామని అన్నారు. 1948, సెప్టెంబర్ 17న సువిశాల భారతదేశంలో తెలంగాణ అంతర్భాగమైన రోజు స్వతంత్ర్య భారతావనిలో అరవై ఏండ్ల స్వీయ అస్థిత్వం కోసం ఉద్యమించి స్వరాష్ట్రంగా అవతరించిన తెలంగాణ నేడు అభివృద్ధి పథంలో ముందంజలో ఉన్నదని అన్నారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి శ‌ఎనుముల రేవంత్రెడ్డి దార్శనిక పాలనలో విద్యుత్తు, నీటిపారుదల, వ్యవసాయ, పరిశ్రమలు, ఉద్యోగ ఉపాధికల్పన, వైద్య, విద్య అభివృద్ధి సంక్షేమంతో పాటు ఐటి నుండి అగ్రికల్చర్ వరకు అన్ని రంగాల్లో ఘణనీయమైన అభివృద్ధిని సాధిస్తూ అనతి కాలంలోనే సంక్షేమ కార్యక్రమాలు అమలులో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నదని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే రెండు హామీలను అమలు చేసి ప్రజల పట్ల తమకు గల అంకితభావాన్ని చాటుకున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ సేవలను 10 లక్షలకు పెంచడం, రైతు రుణమాఫీ, గృహజ్యోతి, గృహలక్ష్మి వంటి పథకాలు అమలు పట్ల ప్రజలలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. పరిపాలనను గ్రామాలకు చేర్చాలన్న ప్రభుత్వ ఆలోచన మేరకు గత సంవత్సరం డిసెంబర్ 28 నుండి జనవరి 6వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లాలో 137 454 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంమహాలక్ష్మి పథకం ద్వారా తెలంగాణ ఆడబిడ్డలు రాష్ట్ర నలు



మూలలకు ఎక్కడి నుండి ఎక్కడికైనా అణాపైసా ఖర్చు లేకుండా ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించడానికి అవకాశం కల్పించామని, జిల్లాలో ఇప్పటి వరకు 5930322 మంది మహిళలు ఉచితంగా ప్రయాణించగా 3105 67172రూపాయలు మహిళలకు ఆదా జరిగిందని పేర్కొన్నారు.రాజీవ్ ఆరోగ్య శ్రీఆరోగ్య తెలంగాణగా ఈ రాష్ట్రం ఉండాలని, ప్రజలకు మెరుగైన కార్పోరేట్ వైద్య సేవలు అందించేందుకు రాజీవ్ ఆరోగ్య శ్రీ సాయాన్ని 10 లక్షలకు పెంచి అమలు చేస్తున్నామని, జిల్లాలో ఇప్పటి వరకు 51 87 మందికి ఈ పథకం ద్వారా వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. ఇందుకు గాను 105059744 రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ఇంటింటి జ్వర సర్వే నిర్వహిస్తూ వైద్య సేవలు అందిస్తున్నామని అన్నారు.

### వ్యవసాయశాఖ ...

దేశానికి పట్టెడు అన్నం పెట్టే అన్నదాత సుఖసంతోషాలతో ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ప్రగాఢంగా విశ్వసించిన రాష్ట్ర ప్రభుత్వం రైతును రుణ విముక్తి చేసేందుకు రుణమాఫి చేపట్టామన్నారు. రైతును రాజును చేయడం మా సంకల్పమని... రైతు బాగుంటేనే రాష్ట్రం పచ్చగా ఉంటుందని విశ్వసించిన ప్రభుత్వం రైతుకు రుణమాఫీ చేశామని, రుణ భారాన్ని మాఫి చేయడంతో రైతన్నలు నేడు సంతోషంగా ఉన్నారని తెలిపారు. అన్నదాత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు వార్షిక ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తూ రైతు బీమా అమలు చేస్తున్నామని, జిల్లాలో 72 766 మంది రైతులకు రైతుబీమా చేసినట్లు తెలిపారు. అకాల మరణం చెందిన 402 మంది రైతు కుటుంబాలకు 20 కోట్ల 10 లక్షలు ఆర్థికసాయాన్ని అందచేసినట్లు తెలిపారు.

### గృహజ్యోతి

అల్పాదాయ వర్గాల వారికి విద్యుత్ బిల్లులు భారం తగ్గించి, వారి గృహాలలో చీకట్లను పారద్రోలి, విద్యుత్ కాంతులను నింపేందుకు గృహజ్యోతి అమలు చేస్తున్నామని తెలిపారు. 200 యూనిట్లు కంటే తక్కువ విద్యుత్ వాడే ప్రతి ఇంటికి ఉచిత వెలుగులు అందిస్తున్నామని, ప్రస్తుతం 51628 మంది ఈ పథకం ద్వారా లబ్దిపొందుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఈ పథకానికి 7562138 రూపాలు సబ్సిడి చెల్లించామని తెలిపారు.

### మహాలక్ష్మి పథకం

ఆడబిడ్డల కన్నీళ్లు తుడవాలన్న లక్ష్యంతో ప్రారంభించిన పథకం మహాలక్ష్మి పథకమని, ఈ పథకం ద్వారా 500 రూపాయలకే వంట గ్యాస్ ఇస్తున్నామని, 66019 మంది లబ్దిదారులను గుర్తించామన్నారు. ఇప్పటి వరకు 126808 సిలెండర్లు సరఫరా చేసి 3.51కోట్లు సబ్సిడి చెల్లించామని అన్నారు.వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు నియంత్రణకు వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమని, పరిసరాలు పరిశుభ్రతలో భాగస్వాములైన సిబ్బందిని, ప్రజలను అభినందించారు. పరిసరాలు పరిశుభ్రతతోనే వ్యాధులు దరిచేరని ఆరోగ్య సమాజం రూపుదిద్దు కుంటుందని అన్నారు. ప్రజలు ఆరోగ్య జీవితాన్ని గడిపేందుకు ప్రతి ఇల్లు పరిశభ్రతతో, మొక్కలతో నందనవనం కావాలని, ప్రతి కుటుంబం తు.చ. తప్పక ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరించి పరిశుభ్రత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పరిసరాలు పరిశుభ్రతో భాగస్వాములు అవుతామని, ఇతరులను భాగస్వాములను చేస్తామని సేసిన ప్రతిజ్ఞలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమాల్లో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో విమోచన దినోత్సవం

**చిట్యాల, సెప్టెంబర్ 17(మనం న్యూస్) :** తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ మొత్తం స్వాతంత్రం ఒకసారి వస్తే నిజాం రజాకార్ల ఆధీనంలో ఉన్నటువంటి తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకంగా స్వతంత్రం రావడం జరిగిందని నిజాం రజాకార్లు తెలంగాణలో ఉన్నటువంటి మన ఆడ బిడ్డలను నగ్నంగా బతుకమ్మ ఆడివ్వడం జరిగిందని ఎంతోమంది ప్రజలను పన్నుల పేరుతో హింసించేవారని కనబడ్డ అటువంటి మహిళలను అత్యాచారాలు చేసే వాళ్లని ఎదురు తిరిగిన వారిని కిరాతకంగా చంపేవారని అలాంటి రజాకారులకు పాలన ఇప్పటికీ కూడా కొనసాగుతున్నదని గత ప్రభుత్వం కూడా రజాకారులకు అనుకూలమైన పరిపాలన కొనసాగించడం జరిగిందని ఇప్పుడున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించకపోవడం కూడా రజాకారులను సమర్థిస్తూ ఈరోజు రాజకీయ లబ్ధి కోసం పరిపాలన కొనసాగిస్తున్నారని అన్నారు. ఇదంతా తెలంగాణ ప్రజానీకం గమనిస్తున్నదని ఇలాంటి పార్టీలను భూస్థాపితం చేయాల్సిన అవస



రం ఎంతైనా ఉన్నదని ఆయన అన్నారు.కార్యక్రమంలో బీజేవైఎం మాజీ జిల్లా అధ్యక్షుడు గొర్రె శశి మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల రఘు శ్రీ పెల్లి అనిల్ జిల్లా మండల నాయకులు సుద్దాల వెంకన్న గజల రవీందర్ మండల మొగిలి సుదగాని శ్రీనివాస్ సుందర్ అశోక్ చారి మైదానం శ్రీకాంత్ కెమ్సరపు ప్రభాకర్ వాళ్ళ ప్రవీణ్ రాయని శ్రీనివాస్ పిట్టల నాగరాజు చింతల రాజేందర్ చింతల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం



**భూపాలపల్లి,సెప్టెంబర్ 17(మనం న్యూస్) :** తెలంగాణా ప్రజా పాలన దినోత్సవ వేడుకలు జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రజలకు, పోలీసు అధికారులకు సిబ్బందికి ప్రజాపాలన దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో అసువులు బాసిన వారి చిత్ర పటాలకు పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో మంది త్యాగాలతోనే హైదారాబాద్ నిజాం సంస్థానం ఇండియన్ యూనియన్ లో విలీనమైందని, 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజలకు స్వాతంత్రం సిద్ధించిందని అన్నారు. హైదరాబాద్ రాష్ట్రం 1948 సెప్టెంబర్ 17న భారత దేశ యూనియన్ నందు విలీనమైన సందర్భంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నేటితో 77 సంవత్సరములు పూర్తి చేసుకొని తెలంగాణ రాష్ట్రం ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించు కోవడం జరుగుతున్నదన్నారు. తెలంగాణకు స్వాతంత్ర్యం సాధించడానికి కృషి చేసిన మహనీయుల సేవలు చిరస్మణీయమని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ( ఆపరేషన్) బోనాల కిషన్, భూపాలపల్లి డిఎస్పి ఏ. సంపత్ రావు, డిపిఓ ఏవో వసీం ఫర్హాన జిల్లా పరిధిలోని సిఐలు, ఎస్సైలు, పోలీసు, డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం

**మల్లూర్,సెప్టెంబర్ 17(మనం న్యూస్) :** తెలంగాణ విమోచన దినోత్సవం వేడుకలు బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన తాడిచర్ల లోని హనుమాన్ సెంటర్లో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా బిజెపి అసెంబ్లీ కన్వీనర్ మల్కా మోహన్ రావు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలో తెలంగాణకు ఆపరేషన్ పోలోతో హైదరాబాద్ సంస్థానాన్ని బారత్ లో విలీనం చేశారని ఈ తెలంగాణ గడ్డకు సెప్టెంబర్ 17 న స్వతంత్ర్యం వచ్చిందన్నారు. ఆగస్టు 15 ఎంత ముఖ్యమో సెప్టెంబర్ 17 కూడా అంతే ముఖ్యం అని అలాంటి రోజును జరుపకుండా పాలకులు అన్యాయం చేస్తున్నారని చరిత్రను పట్టించుకోని పార్టీలకు, పాలకులకు తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు ముడితనపెల్లి ప్రభాకర్, తాడిచర్ల శక్తి కేంద్రం ఇంచార్జీ మల్లె వేణి రమేష్ నాయకులు తూండ్ల రాజయ్య, గాదనవేన రాజయ్య, బూత్ అధ్యక్షులు నారమల్ల రంజిత్, నిషాన్ పాష, గుంటుకు సమ్మయ్య, రాజు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



# అమరుల త్యాగఫలమే నేటి తెలంగాణ అభివృద్ధి ఫలాలు

**భువనగిరి, సెప్టెంబర్ 17 (మనం న్యూస్) :** అమరుల త్యాగఫలం గానే తెలంగాణ అభివృద్ధి ఫలాలు నేడు పొందుతున్నామని తెలంగాణ రాష్ట్ర శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం నాడు తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఆయన జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని ఆయన స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవము జరుపుకుంటున్న శుభ సందర్భంగా రాచరిక వ్యవస్థ నుండి ప్రజా పాలనా వ్యవస్థ ఆవిర్భావానికి నాంది పలికిన అమరులైన తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాట యోధులకు, స్వాతంత్ర్య సమరయోధులు అందరికీ జోహార్లు తెలిపారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజు, హైదరాబాద్ సంస్థానం భారత్ యూనియన్‌లో చేరి నేటికి 76 సంవత్సరాలు పూర్తి చేసుకొని 77వ సంవత్సరంలోకి అడుగిడుతున్న శుభ సందర్భంగా హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు, అనధికారులు, పాత్రికేయులు, ఉద్యమకారులకు, కార్మిక, కర్షక, విద్యార్థినీ, విద్యార్థులకు, జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ ఫలాలు అరుహ్లైన వారందరికి అందేలా ఉమ్మడి నల్లగొండ జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న గౌరవ జిల్లా మంత్రి వర్యులు, గౌరవ పార్లమెంటు సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు జిల్లా కలెక్టర్ హనుమంత్ కె.జెండగే, డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ రాజేష్ చంద్ర, జిల్లా అధికారయం త్రాంగం, పాత్రికేయ మిత్రులకు పేరు పేరున శుభాభివందనాలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమం



లో కేజీబీవీ విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి శాస నసభ్యులు మందుల సామేలు, జిల్లా కలెక్టర్ హనుమంత్ కే. జెండగే, డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేష్ చంద్ర, భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే.గంగాధర్, జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్పి. బెన్ షాలోమ్, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## కళాశాలను ఆకస్మిక తనిఖీ



**మహాదేవపురం,సెప్టెంబర్ 17 (మనం న్యూస్) :** మహాదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీ డియట్ విద్యాధికారి భూక్యా వెంకన్న మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల నిర్వహణ సంబంధిత పలు రికార్డులు ఆయన పరిశీలిచారు. కళాశాల లో తరగతుల నిర్వహణ ఎంసెట్ బోధన , కళాశాలకు హాజరు కాని విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధ్యాపకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్ర పలకల ప్రసాద్. అధ్యాపకులు సమ్మయ్య. సదాశివ్.సదానందం. సంధ్య శ్వేత రమాదేవి నాగలక్ష్మి శైలజ పోచయ్య పిన్నయ్య , నాన్ టీచింగ్ స్టాఫ్ లక్ష్మణ్ రాజయ్య లు ఉన్నారు.

## నిమజ్జనోత్సవాన్ని పరిశీలించిన డిసిపి రాజేష్ చంద్ర



**వలిగొండ, సెప్టెంబర్ 17 (మనం న్యూస్) :** వలిగొండ మండలం సంగెం మూసి వద్ద నిర్వహిస్తున్న గణేష్ నిమజ్జనోత్సవాన్ని భువనగిరి డిసిపి రాజేష్ చంద్ర పరిశీలించారు. మంగళవారం ఆయన మూసి భీమలింగాన్ని సందర్శించి వినాయక విగ్రహాలను క్రేన్ల సహాయంతో నిమజ్జనం చేస్తున్న దృశ్యాలను పరిశీలించారు. భీమ లింగం మూసి వద్ద వినాయకులను నిమజ్జనం చేసేందుకు చుట్టుప్రక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున వినాయకులను తెచ్చి నిమజ్జనం చేస్తున్న నేపథ్యంలో ఆయన ఈ ప్రాంతాన్ని సందర్శించారు. నిమజ్జనోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. వినాయక విగ్రహాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని డిసిపి కోరారు. ఆయన వెంట చౌటుప్పల్ ఏసిపి పటోళ్ల మధుసూదన్ రెడ్డి, రామన్నపేట సిఐ వెంకటేశ్వర్లు ,వలిగొండ ఎస్సై యుగంధర్ గౌడ్ ఉన్నారు.

# మోదీ@74



**భువనేశ్వర్, సెప్టెంబర్ 17 :** ప్రధాని మోదీ ఒడిశాలో రూ.2800కోట్లతో చేపట్టనున్న జాతీయ రైల్వే ప్రాజెక్టులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. రూ.1000 కోట్ల నేషనల్ హైవే ప్రాజెక్టుకు కూడా శంకుస్థాపన చేశారు. పీఎంఎవైజి పథకం కింద 14 రాష్ట్రాలకు చెందిన దాదాపు 10 లక్షల మంది లబ్ధిదారులకు మొదటి విడత కింద నిధులు విడుదల చేశారు. ఇదే పథకంలోని 26 లక్షల లబ్ధిదారులకు గృహాలు కేటాయిస్తూ వారికి అప్పచెప్పారు. ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత ఒడిశా రాష్ట్రానికి రావడం ఇదే ప్రథమమని, కొత్త ప్రభుత్వం వచ్చి ఇప్పటికి వంద రోజులైందని పేర్కొన్నారు. పూరీ జగన్నాథ రత్నభాండాగారం తెరవడంతోపాటు ఇప్పటివరకు తమ ప్రభుత్వం నెరవేర్చిన హామీలను వివరించారు. దేశంలో పేదలకు 3 కోట్ల పక్కా ఇళ్లు నిర్మించడానికి నిర్ణయం తీసుకున్నామని, యువతకు రూ. 2 లక్షల కోట్ల పీఎం ప్యాకేజీ కింద ఉద్యోగాలు కల్పిస్తామని, ఈమేరకు ప్రైవేట్ సంస్థల్లో వారికి ఉద్యోగాలు కల్పించడమౌతోందని, ఈ మేరకు వారు మొదటి వేతనం తీసుకుంటున్నారని ప్రకటించారు. మెడికల్ కాలేజీల్లో అదనంగా 78,000 సీట్లు కేటాయించడమైందన్నారు. 60,000 గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాజెక్టు చేపట్టనున్నట్టు చెప్పారు.

### ఒడిశాలో 'సుభద్రయోజన'

ఒడిశాలో పర్యటిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ 74వ పుట్టిన రోజు సందర్భంగా మహిళలకు ఆర్థిక ప్రయోజనం కలిగించే సుభద్రయోజన పథకాన్ని మంగళవారం ప్రారంభించారు. ఒడిశాలోని అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు ప్రధాని చేశారు. ఒడిశా ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ సుభద్రయోజన పథకం వల్ల అర్హులైన మహిళలకు ఏటా రూ.10 వేలు రాష్ట్రప్రభుత్వం అందిస్తుంది. 21 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు కోటి మంది లబ్ధిదారులైన మహిళల రెండు విడతల్లో రూ.5 వేలు వంతున మొత్తం రూ.10 వేలు జమ అవుతుంది. 2024-25 నుంచి 2028-29 వరకు ఐదేళ్ల పాటు ఈ ఆర్థికసాయం అందుతుంది. ఇప్పటికే 60 లక్షల మంది మహిళలు ఈ పథకంలో లబ్ధిదారులుగా నమోదు చేసుకున్నారు. ఈ నెల 15వ తేదీలోపు నమోదు చేసుకున్న వారి ఖాతాల్లో మంగళవారం తొలి విడత నగదు జమ చేశారు. ఈ పథకం కోసం ఒడిశా ప్రభుత్వం సుమారు రూ.55,825 కోట్లు కేటాయించింది. ఒడిశాలోని ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా ఏడాదికి రూ.18 వేలు పొందే మహిళలు ఈ సుభద్రయోజనకు అర్హులు కారని ఒడిశా ప్రభుత్వం స్పష్టం చేసింది.

పుట్టిన రోజు సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఒడిశా రాష్ట్రాన్ని సందర్శించారు. భువనేశ్వర్‌లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద కేటాయించిన ఇళ్లను ఆయన స్వయంగా సందర్శించారు. అక్కడి మహిళలతో మాట్లాడారు. ప్రధానిని ఒడిశా ప్రజలు సంప్రదాయరీతిలో ఘన స్వాగతం పలికారు. వారి ఇంటిలో ప్రధాన మంత్రి పూజ చేశారు. వారందించిన జగన్నాథుడిని చిత్రపటాన్ని, పాయసాన్ని స్వీకరించారు. ప్రధాని మోదీ వెంట ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మార్ఝి కూడా ఉన్నారు.

## 74వ వసంతంలోకి అడుగు పెట్టిన ప్రధాని నరేంద్ర మోదీ

### ప్రధాని మోదీకి శుభాకాంక్షల వెల్లువ

నరేంద్ర మోదీ 1950 సెప్టెంబర్ 17న గుజరాత్‌లోని వాద్‌నగర్‌లో జన్మించారు. ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం 74వ వసంతంలోకి అడుగుపెట్టారు. ఆయా రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. 'భరతమాత ముద్దుబిడ్డ, విజనరీ లీడర్, పీఎం మోదీకి పుట్టినరోజు శుభాకాంక్షలు. బలమైన, సంపన్నమైన భారత న్ను నిర్మించాలన్న మీ విజన్ అందరి హృదయాల్లో ధ్వనిస్తోంది. అంకితభావంతో దేశాన్ని అభివృద్ధి చేసి భవిష్యత్తు తరాలకు ప్రేరణనివ్వాలి' అంటూ ట్వీట్లు చేస్తున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని మోదీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నేతలతో పాటుగా ప్రతిపక్ష పార్టీ నేతలు కూడా ప్రధానికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మోదీ వినూత్న ప్రయత్నాలు దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపించడానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ 74వ జన్మదినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతోపాటు పలువురు రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు మంగళవారం ఆయనకు శుభాకాంక్షలు తెలియచేశారు. ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు.

ప్రధానికి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసిన రాజకీయ ప్రముఖులలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, తెలుగు రాష్ట్రాల సీఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తదితరులు ఉన్నారు. అదే విధంగా వివిధ భాషలకు చెందిన సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి, అక్షయ్ కుమార్, సునీల్ షెట్టి, జాకీ ష్రాఫ్ తదితరులు ఎక్స్ వేదికగా ప్రధాని మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు.

ప్రధాని మోదీ ఓ విజన్ ఉన్న నేత అని కొనియాడారు. పుట్టిన రోజు సందర్భంగా మోదీకి విషెష్ చెబుతూ త్రిపుర సీఎం మానిక్ సాహా ట్వీట్ చేశారు. విజినరీ నేత, భారతమాత ముద్దు బిడ్డకు బర్త్‌డే విషెస్ అని సీఎం మానిక్ సాహా తెలిపారు. బలమైన, సుసంపన్నమైన దేశం కోసం విజన్‌తో ప్రధాని మోదీ పనిచేస్తున్నారని, ఇది ప్రతి ఒక్క భారతీయుడి గుండెలో మారుమోగుతుందని, క్రియాశీలమైన మీ నాయకత్వం, దీక్ష.. ఈ దేశాన్ని మారుస్తుందని త్రిపుర సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

మహారాష్ట్ర సీఎం ఏకనాథ్ షిండే కూడా బర్త్‌డే విషెస్ తెలిపారు. మంచి ఆరోగ్యాన్ని, సుదీర్ఘ జీవితాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రధాని మోదీ నేతృత్వంలో భారత దేశం ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని, భారత్‌ను 2047 వరకు డెవలప్ చేయాలని ఆశించిన ఆయన సంకల్పం నెరవేరాలని కోరుతున్నట్లు సీఎం షిండే తెలిపారు.

ప్రఖ్యాత శిల్పి సుదర్శన్ పట్నాయక్ కూడా మోదీకి బర్త్‌డే విషెస్ తెలిపారు. సైకత శిల్పం ద్వారా కూడా ఆయన శుభాకాంక్షలు తెలిపారు.



# దేశంలో అభివృద్ధి పరుగులు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17 :** ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు ఏర్పడి వంద రోజులు దాటిన నేపథ్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు దేశంలో రాజకీయ స్థిరత్వాన్ని తీసుకువచ్చిందన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని, ప్రజలు వాటికి సాక్ష్యాలుగా నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు. అమిత్ షాతో పాటు మంత్రులు అశ్వినీ వైష్ణవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 100 రోజుల పాలనలో సాధించిన ప్రగతిపై రూపొందించిన ఓ బుక్‌లెట్‌ను అమిత్ షా ఆవిష్కరించారు. పదేళ్ల అభివృద్ధి, భద్రత, సంక్షేమం తర్వాత ప్రజలు మూడవ సారి బీజేపీ మిత్ర కూటమిని మరోసారి ఆశీర్వదించారని ఆయన పేర్కొన్నారు. గడిచిన 60 ఏళ్లలో ఇలా జరగడం ఇదే మొదటిసారి అని పేర్కొన్నారు. ఇది దేశంలో రాజకీయ స్థిరత్వాన్ని తీసుకువచ్చిందని, పాలసీలను సమర్థవంతంగా అమలు చేశామన్నారు. ప్రధాని మోదీ తీసుకువచ్చిన కొత్త విద్యా విధానంలో.. ప్రాచీన, ఆధునిక విద్యా వ్యవస్థలు ఉన్నట్లు తెలిపారు. ఆ విద్యా వ్యవస్థ ప్రాంతీయ భాషలను గౌరవిస్తుందని హోంమంత్రి తెలిపారు. వంద రోజుల పాలన సమయంలో.. సుమారు మూడు లక్షల కోట్ల ప్రాజెక్టులను ప్రకటించినట్లు ఆయన వెల్లడించారు. గత పదేళ్లలో ఇండ్లు, టాయిలెట్లు, గ్యాస్ కనెక్షన్లు, తాగునీరు, విద్యుత్తు, ఉచిత ఆహార ధాన్యాలు, ఆరోగ్యం అందించినట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల వరకు దేశంలో ఇండ్లు లేని వారు ఉండకూడదన్న లక్ష్యంతో పనిచేయనున్నట్లు అమిత్ షా తెలిపారు. ఇకపోతే దేశంలో వరుసగా జరుగుతున్న రైలు ప్రమాదాల వెనక ఏదైనా కుతంత్రాలు దాగి ఉంటే వెలికి తీస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. కుట్రలు ఎక్కువ రోజులు దాగి ఉండవని వ్యాఖ్యానించారు. 1.10 లక్షల కిలోమీటర్ల రైల్వే నెట్‌వర్క్ పరిరక్షణకు ప్రభుత్వం అతి త్వరలోనే కీలక చర్యలు తీసుకోంటుందని వెల్లడించారు. ప్రభుత్వ పనితీరును ఆయన వివరిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. రైల్వే భద్రతపై ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఈ అంశంపై తాను చర్చించానని అమిత్‌షా పేర్కొన్నారు. 'రైల్వే ప్రమాదాల విషయానికి వస్తే వాటి మూలకారణాలపై దర్యాప్తు చేస్తాం. కారణం ఏదైనా.. ప్రభుత్వం వీటిపై దృష్టి పెడుతుంది. ఇది కుట్ర అయితే.. ఎక్కువ కాలం కొనసాగదు. ఏమైనా లోపాలు ఉంటే వాటిని సరిచేస్తాం. ఇటీవల ఘటనలను దృష్టిలో పెట్టుకొని బలమైన ప్రణాళికను సిద్ధం చేసుకొంటున్నాం. మోదీ ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో 38 రైలు ప్రమాదాలు జరిగాయంటూ కాంగ్రెస్ చేసిన ఆరోపణలను అమిత్‌షా కొట్టి పారేశారు. అవి మొత్తం చిన్న ఘటనలని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో రైల్వే నెట్‌వర్క్‌ను గణనీయంగా విస్తరిస్తున్నట్లు ప్రజలు గుర్తించారన్నారు. ఈ 100 రోజుల్లోనే ఎనిమిది కొత్త రైల్వే ప్రాజెక్టులకు ఆమోద ముద్రవేసినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులతో దాదాపు 4.42 కోట్ల మానవ పనిదినాల ఉపాధి లభిస్తుందని కేంద్ర హోం మంత్రి వెల్లడించారు. ఇటీవల కొందరు దుండగులు పట్టాలపై ఎల్పీజీ సిలిండర్లు, సైకిళ్లు, ఇనుప రాడ్లు, సిమెంట్ ఇటుకలను పెట్టి రైలు ప్రమాదాలు జరిగేలా దుశ్చర్యలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. గత ఏడాది జూన్ నుంచి ఈ తరహాలో 24 ఘటనలు జరిగాయని భారత రైల్వే కొన్నాళ్ల క్రితం నివేదికలో వెల్లడించింది. అందులో ఆగస్టులో 15, సెప్టెంబర్‌లో 3 ఘటనలను గుర్తించారు. అత్యధికంగా ఉత్తర్‌ప్రదేశ్, తర్వాత పంజాబ్, ఝార్ఖండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశా, తెలంగాణలో ఈ కుట్రపూరిత యత్నాలు బయటపడ్డాయి. ఆగస్టులో కాన్పూర్ సమీపంలో సబర్మతి ఎక్స్‌ప్రెస్ 20 బోగీలు పట్టాలు తప్పాయి. ట్రాక్‌పై ఉంచిన ఓ వస్తువు కారణంగా ఈ పరిస్థితి తలెత్తింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంపై అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత కాన్పూర్, రాజస్థాన్‌లోని అజ్మీర్‌లోను ఈ తరహా ఘటనలు వెలుగుచూశాయి.

# బుల్డోజర్ చర్యలను ఆపండి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17:** దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో జరుగుతున్న బుల్డోజర్ చర్యలపై దేశ సర్వోన్నత న్యాయస్థానం సంచలన ఆదేశాలు జారీ చేసింది. అక్టోబర్ 1వ తేదీ వరకు కోర్టు అనుమతి లేకుండా దేశంలో ఎక్కడా ఆస్తులను కూల్చరాదని ధర్మాసనం ఆదేశించింది. అయితే ఈ ఉత్తర్వు పబ్లిక్ రోడ్లు, ఫుట్‌పాత్‌లు, ఇతర వాటిపై అనధికారిక నిర్మాణాలకు మాత్రం వర్తించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నేరాలకు పాల్పడిన వ్యక్తుల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని అధికారులు కూల్చివేస్తున్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ కొందరు సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారు. మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించి తాజా ఉత్తర్వు జారీ చేశారు. ఇదిలా ఉంటే వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న బుల్డోజర్ సంస్కృతిని ఇప్పటికే సుప్రీంకోర్టు ఖండించింది. ఇలాంటి చర్యలను గొప్పగా చేయొద్దని ప్రభుత్వాలకు వార్నింగ్ ఇచ్చింది. అయితే ఈ విషయంలో ఎన్నికల కమిషన్‌ను కూడా పిలవవచ్చని హెచ్చరించింది. మహారాష్ట్ర, జార్ఖండ్, జమ్మూ కశ్మీర్, హర్యానాల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో ఈసీకి నోటీసులు ఇస్తామని చెప్పడం ప్రాధాన్యం సంతరించుకొంది. ఈ రాష్ట్రాల్లో చాలా చోట్ల బీజేపీ అధికారంలో ఉంది. అదే సమయంలో బహిరంగ స్థలాలు, రైల్వే ఆస్తులు, నీటి వనరుల ఆక్రమణల తొలగింపు విషయంలో మాత్రం తమ ఆదేశాలు వర్తించవని తేల్చిచెప్పింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే, సీయూ సింగ్ వాదనలు వినిపించారు. ఇప్పటికే సెప్టెంబర్ 2న జరిగిన వాదనల్లో దేశంలో ఎక్కడా ఈ తరహా చర్యల్లో మార్గదర్శకాలను పాటించడంలేదని పేర్కొన్నారు. ఈ కేసులో ప్రధాన పిటిషనర్‌గా జామత్ ఉలేమా హింద్ వ్యవహరిస్తోంది. కూల్చివేతలకు ముందు కనీసం 40,60రోజుల ముందుగా నోటీసులు జారీ చేయాలని, చట్ట వ్యతిరేక కూల్చివేతలకు సదరు అధికారులను బాధ్యులను చేయాలని ఆ సంస్థ సుప్రీంకు నివేదించింది. యూపీ ప్రభుత్వం పక్షాన సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.

## సుప్రీం బుల్‌డోజర్ ఆదేశాలు హైడ్రాకు వర్తించవు

### హైడ్రా కమిషనర్ రంగనాథ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (మనం న్యూస్) :** బుల్డోజర్ న్యాయాన్ని ఆపాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. ఆ ఆదేశాలు హైడ్రాకు వర్తించవని తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని నేరస్థులు, నిందితుల ఆస్తుల కూల్చివేతలకు మాత్రమే సుప్రీం ఆదేశాలు వర్తిస్తాయన్నారు. చెరువులు, నాలాలు, ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించి నిర్మించిన వాటిని మాత్రమే హైడ్రా కూల్చివేస్తుందని స్పష్టం చేశారు. నేరస్థులు, నిందితులకు సంబంధించిన ఎలాంటి ఆస్తుల జోలికి హైడ్రా వెళ్లడం లేదని రంగనాథ్ పేర్కొన్నారు. బహిరంగ స్థలాలు, రైల్వే ఆస్తులు, నీటి వనరుల ఆక్రమణల తొలగింపులో తమ ఆదేశాలు వర్తించవన్న సుప్రీంకోర్టు ఆదేశాలను రంగనాథ్ గుర్తుచేశారు. హైడ్రా కూల్చివేతలపై ఇటీవల పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించారు. హైడ్రా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా కూల్చివేతలు చేస్తుందని, న్యాయం చేయాలంటూ కోర్టును ఆశ్రయించడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో తాజాగా సుప్రీంకోర్టు ఆదేశాలు రావడంతో రంగనాథ్ స్పందించారు. ఆ ఆదేశాలు హైడ్రాకు వర్తించవని స్పష్టం చేశారు.

# సీఎం పదవికి కేజ్రీవాల్ రాజీనామా



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17 :** ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి కేజ్రీవాల్ రాజీనామా చేయడంతో.. ఆయన స్థానంలో అతిషీని తదుపరి సీఎంగా ఆప్ నేతలు ఎన్నుకున్నారు. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తానని అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించిన నేపథ్యంలో తర్వాత సీఎంగా ఎవరు బాధ్యతలు తీసుకుంటారనే ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్ర మంత్రి అతిషిని ఢిల్లీ కొత్త సీఎంగా కేజ్రీవాల్ ప్రకటించారు. సీఎంగా ఆతిషి బాధ్యతలు చేపడతారని ఆయన వెల్లడించారు. సీఎంగా ఎవరిని నియమించాలని పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులతో కేజ్రీవాల్ చర్చించారు. అనంతరం శాసన సభా పక్ష సమావేశంలో మంత్రి అతిషి పేరును ప్రతిపాదించారు కేజ్రీవాల్. ఈ ప్రతిపాదనకు శాసనసభాపక్షం ఆమోదం తెలిపింది. కాగా, ఢిల్లీ లిక్కర్ స్కాంలో మనీ లాండరింగ్ ఆరోపణలతో అరెస్టైన కేజ్రీవాల్‌కు ఇటీవలే సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. తీహార్ జైలు నుంచి విడుదలైన ఆయన.. తన పదవికి రాజీనామా చేస్తానని ఆదివారం సంచలన ప్రకటన చేశారు. ఢిల్లీ ప్రజలు తనకు నిజాయతీపరుడినని సర్టిఫికెట్ ఇచ్చేవరకూ సీఎం పదవిలో ఉండనని స్పష్టం చేశారు. మధ్యంతర ఎన్నికలకు వెళ్లి తన విశ్వసనీయతను పరీక్షించుకుంటానని చెప్పారు. సీఎం పదవికి రాజీనామా చేయనున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సంచలన ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ప్రజలు తనకు సర్టిఫికెట్ ఇచ్చేంతవరకూ ముఖ్యమంత్రి పదవిలో ఉండబోనని స్పష్టంచేశారు. సీఎం కుర్చీ నుంచి దిగిపోయి.. మధ్యంతర ఎన్నికలకు వెళ్లి ప్రజల్లో తన విశ్వసనీయతను పరీక్షించుకుంటానని ప్రకటించారు. మద్యం విధానానికి సంబంధించిన కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేజ్రీవాల్ గతవారమే తిహాడ్ జైలు నుంచి విడుదలయ్యారు. ఈ క్రమంలోనే ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేశారు. మంగళవారం సాయంత్రం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కలిసిన ఆయన.. తన రాజీనామా లేఖను సమర్పించారు. ఆయన వెంట ఆప్ శాసనాసభాపక్ష నేతగా ఎన్నికైన ఆతిషీ, ఇతర మంత్రులు, ఆప్ నేతలు ఉన్నారు. ఆప్ ఎల్పీగా ఆతిషీని ఎన్నుకున్నట్లు కేజ్రీవాల్ ఎల్జీకి తెలిపారు. కేజ్రీవాల్ రాజీనామాను ఎల్జీ ఆమోదించాక.. త్వరలోనే ఢిల్లీ నూతన సీఎంగా ఆతిషీ ప్రమాణస్వీకారం చేయనున్నారు. అప్పటి వరకు ఆపద్ధర్మ సీఎంగా ఉండాలని కోరారు.

ఈ నెల 26,27 తేదీల్లో ఢిల్లీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఆ సమావేశాల్లోనే ఆతిశీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు ఆప్ వర్గాలు వెల్లడించాయి. ఈసారి డిప్యూటీ సీఎంగా ఎవరినీ ప్రకటించే అవకాశాలు లేవని తెలుస్తోంది. ఢిల్లీ అసెంబ్లీకి వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే నవంబరులోనే మధ్యంతర ఎన్నికలు నిర్వహించాలని కేజ్రీవాల్ డిమాండు చేస్తున్నారు. అయితే, ఎన్నికల సంఘం మాత్రం ముందస్తుకు సుముఖంగా లేదని తెలుస్తోంది. ఫిబ్రవరిలోనే ఈసీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు సమాచారం. కాగా, మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్ ఇటీవలే బెయిల్‌పై విడుదలయ్యారు. అయితే, బెయిల్ మంజూరు చేస్తూ.. సీఎం కార్యాలయానికి వెళ్లకూడదని, అధికారిక ఫైల్స్‌పై సంతకం చేయకూడదని కేజ్రీవాల్‌ను సుప్రీం కోర్టు ఆదేశించింది. దీంతో కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే.

## నేడు శ్రీనగర్‌లో ప్రధాని ఎన్నికల ర్యాలీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17 :** ప్రధాని నరేంద్ర మోదీ నేడు ప్రసంగించనున్న ఎన్నికల ర్యాలీకి ముందుగా శ్రీనగర్‌లోని షేర్ ఎ కాశ్మీర్ పార్క్ పరిసరాల్లో పలు అంచెల భద్రత ఏర్పాట్లు చేసినట్లు సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలియజేశారు. ఈ నెల చివర్లో కేంద్ర పాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాశ్మీర్లో బీజేపీ అభ్యర్థుల తరపున మోదీ ప్రసంగించనున్న తొలి ర్యాలీ ఇది. 'అటువంటి సభల కోసం నిర్దేశించిన ప్రామాణిక నిర్వహణ నియమావళి (ఎస్ఒపి)ప్రకారం, వివిఐపి పర్యటన కోసం పలు అంచెల భద్రత ఏర్పాట్లు చేశాం' అని పోలీస్ ఐజి వికె బిర్ది మంగళవారం వెల్లడించారు. సభ వేదిక విశిష్ట లాల్ చౌక్ క్లాక్ టవర్కు ఒక కిలోమీటర్ దూరంలో ఉంది. పోలీసులు తగిన ఏర్పాట్లు చేసినట్లు బిర్ది తెలిపారు.

## అమెరికాలో క్వాడ్ సమ్మిట్

### 21 నుంచి యూఎస్‌లో పృటించనున్న మోదీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17 :** ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటన ఖరారయ్యింది. ఈనెల 21 నుంచి 23 వరకు మూడు రోజుల పాటు మోదీ అమెరికాలో పర్యటించనున్నారు. జో బైడెన్ ఆధ్వర్యంలో డెలావేర్‌లోని విల్మింగ్టన్‌లో జరగబోయే క్వాడ్ సమ్మిట్‌లో పాల్గొననున్నారు. ఈ సమ్మిట్‌కు ప్రధాని మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, జపాన్ పీఎం ఫుమియో కిషిడా సమావేశమవుతారు. ఈ సమ్మిట్ ఈసారి భారత్ లో జరగాల్సి ఉంది. అయితే అమెరికా విజ్ఞప్తి మేరకు 2025లో క్వాడ్ సమ్మిట్ భారత్‌లో నిర్వహించనుంది. సెప్టెంబర్ 22న ప్రవాస భారతీయులను ఉద్దేశించి మోదీ ప్రసంగించనున్నారు. ఈ ఈవెంట్‌కు 24 వేల మందికి పైగా హాజరయ్యే అవకాశం ఉంది. సెప్టెంబర్ 23న న్యూయార్క్‌లో జరిగే యూఎన్ సమ్మిట్ ఫర్ ధి ఫ్యూచర్‌లో ప్రధాని మోదీ పాల్గొననున్నారు.

## యాగీ తుపాను విధ్వంసం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17 :** భారీ వర్షాలతో మయన్మార్ అతలాకుతలమైంది. ఈ క్రమంలోనే యాగీ తుపాను విరుచుకుపడటంతో వరదలు పోటెత్తాయి. పెద్దఎత్తున కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనల్లో దాదాపు 226 మంది మృతి చెందారు. మరో 77 మంది గల్లంతైనట్లు అధికారిక మీడియా వెల్లడించింది. లక్షలాది మంది ప్రజలు తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. దాదాపు 6.30 లక్షలమంది ప్రకృతి విపత్తుతో ప్రభావితమయ్యారని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఐరాస తెలిపింది. మయన్మార్‌లో ఇటీవలి సంవత్సరాల్లో అత్యంత దారుణమైన వరదలు ఇవేనని పేర్కొంది. ఇప్పటికే అంతర్యుద్ధంతో సతమతమవుతున్న మయన్మార్‌లో వరదల ధాటికి.. వేల ఎకరాల్లో పంట నాశనమైంది. రాజధాని నేపిడావ్ ప్రాంతం తీవ్రంగా ప్రభావితమైంది. దాదాపు ఐదు లక్షల మంది ప్రజలు ఆహారం, తాగునీరు, సరైన ఆశ్రయం లేక అల్లాడుతున్నట్లు ఐరాస తెలిపింది. రహదారుల వంటి మౌలిక సౌకర్యాలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని పేర్కొంది. ఈ క్రమంలోనే తమ దేశాన్ని ఆదుకోవాలని అక్కడి సైనిక పాలక వర్గం జుంటా విదేశీ సాయాన్ని అభ్యర్థించినట్లు తెలుస్తోంది. వియత్నాం, థాయ్‌లాండ్, లావోస్‌లలోనూ యాగీ తుపాను విధ్వంసం సృష్టించింది. ఒక్క వియత్నాంలోనే 300 మందిని బలితీసుకుంది.

## మీ నాయకులను కట్టడి చేయండి

### ప్రధాని మోదీకి ఖర్గే లేఖ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17 :** లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని కొందరు బీజేపీ నాయకులులతోపాటు ఆ పార్టీ మిత్రపక్షాలకు చెందిన కొందరు సభ్యులు చేస్తున్న అభ్యంతరకర, హింసాత్మక వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్ర అభ్యంతరం తెలియచేస్తూ మీ నాయకులను కట్టడి చేయాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి మంగళవారం ఒక లేఖ రాశారు. భారత రాజకీయాలు దిగజారకుండా నివారించేందుకు, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అడ్డుకునేందుకు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధానికి రాసిన లేఖలో ఖర్గే స్పష్టం చేశారు. భారతదేశ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి ప్రత్యక్షంగా సంబంధించిన ఈ అంశాన్ని మీ దృష్టికి తీసుకువస్తున్నానని ఖర్గే తన లేఖలో తెలిపారు. బీజేపీ, మీ మిత్రపక్షాల నాయకులు ఉపయోగిస్తున్న భాష భవిష్యత్తుకు చాలా హానికరమని ఆయన పేర్కొన్నారు. ఉత్తర్ ప్రదేశ్ చెందిన కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి(రవనీత్ సింగ్ బిట్టూ), బీజేపీ పాలిత యుపి రాష్ట్ర మంత్రి (రఘురాజ్ సింగ్) లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిని నంబర్ ఒన్ ఉగ్రవాదిఅంటూ ఆరోపించడంపై ప్రపంచమంతా దిగ్భ్రాంతి చెందిందని ఆయన తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వంలోని మీ మిత్రపక్షమైన శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ రిజర్వేషన్ విధానంపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ రాహుల్ నాలుక కోసిన వారికి రూ.11 లక్షలు బహుమానం ఇస్తానని ప్రకటించారని మోదీకి రాసిన లేఖలో ఖర్గే ప్రస్తావించారు. మీ నాయన్మకు పట్టిన గతే నీకూ పడుతుందంటూ ఢిల్లీకి చెందిన మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు ఒకరు రాహుల్ గాంధీని హెచ్చరించారని ఖర్గే గుర్తు చేశారు.

# ఆసియా విజేత భారత్






ఇటీవలే ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచి జోరు మీదున్న భారత హాకీ జట్టు మరో మెగా టోర్నీలో సత్తాచాటింది. చైనా వేదికగా జరిగిన ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీ (ఏసీటీ) ఫైనల్లో భారత్.. 1-0తో చైనాను ఓడించి వరుసగా రెండోసారి, మొత్తంగా ఐదోసారి ఏసీటీని సొంతం చేసుకుంది. టోర్నీలో ఓటమన్నదే లేకుండా ఫైనల్ చేరిన హర్మన్‌ప్రీత్ సింగ్ సేనకు తుది పోరులో చైనా నుంచి గట్టి సవాలే ఎదురైనా జుగ్రాజ్ సింగ్ 51వ నిమిషంలో కొట్టిన గోల్తో భారత్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. టోర్నీ ఆసాంతం అద్భుతంగా రాణించి ప్రతి మ్యాచ్లోనూ గోల్ కొట్టిన హర్మన్‌ప్రీత్ ఫైనల్లో గోల్ చేయడంలో విఫలమైనా జుగ్రాజ్‌కు బంతిని అందించడంలో సఫలీకృతుడయ్యాడు. మూడో స్థానం కోసం జరిగిన పోరులో పాకిస్థాన్.. 5-2తో దక్షిణ కొరియాను ఓడించి పరువు నిలుపుకుంది.

### పోరాడిన చైనా..

భారత్‌తో పోల్చితే అంతగా అనుభవం లేని చైనాకు ఇది అంతర్జాతీయ స్థాయిలో రెండో ఫైనల్ (2006 ఆసియా క్రీడల్లో తొలిసారి ఫైనల్ చేరింది) మాత్రమే. కానీ సొంతగడ్డపై ప్రేక్షకుల మద్దతుతో ఆ జట్టు రెచ్చిపోయింది. తొలి మూడు క్వార్టర్స్‌లో మన ఆటగాళ్లు ఎంత ప్రయత్నించినా చైనా రక్షణ శ్రేణి గోల్ చేసే అవకాశమే ఇవ్వలేదు. లీగ్ దశలో భారత్‌కు (3-0)తో అలవోకగానే లొంగిన చైనా.. ఫైనల్లో మాత్రం హోరాహోరీగా పోరాడింది. ఆట ఆరంభంలో భారత ఆటగాడు రాజ్‌కుమార్ పాల్ గోల్ చేసేందుకు అవకాశం దక్కినా చైనా గోల్ కీపర్ వాంగ్ వీహావ్ దానిని విజయవంతంగా అడ్డుకున్నాడు. 10వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ (పీసీ) అవకాశాన్నీ భారత్ సద్వినియోగం చేసుకోలేదు. తొలి క్వార్టర్ ముగియనుండగా చైనాకు వచ్చిన పీసీని భారత గోల్ కీపర్ కృషణ్ బహదూర్ పాఠక్ అడ్డుకున్నాడు. రెండో క్వార్టర్లోనూ దాదాపు ఇదే కథ నడిచింది. 'మెన్ ఇన్ బ్లూ' ఎదురుదాడికి చైనా దీటుగానే సమాధానమిచ్చింది.

### జుగ్రాజ్ గోల్..

ఆట నాలుగో క్వార్టర్ దాకా గోల్ లేకుండా డ్రా దిశగా సాగుతున్న మ్యాచ్కు ఆఖర్లో హర్మన్‌ప్రీత్, జుగ్రాజ్ ఊపు తెచ్చారు. నాలుగో క్వార్టర్ 9వ నిమిషంలో చైనా డిఫెన్స్ను తప్పించుకుంటూ సర్కిల్లోకి వచ్చిన హర్మన్‌ప్రీత్.. గోల్‌పోస్ట్‌కు అత్యంత సమీపంలో ఉన్న జుగ్రాజ్కు బంతిని పాస్ చేశాడు. బంతిని అందుకున్న జుగ్రాజ్.. రెప్పపాటు వేగంతో దానిని గోల్‌పోస్ట్‌లోకి పంపించి తొలి గోల్ కొట్టడంతో భారత్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఇక ఆఖర్లో చైనా గోల్‌కీపర్‌ను తప్పించి ఎక్స్ట్రా ఫీల్డర్తో గోల్ కోసం యత్నించినా ఫలితం దక్కలేదు. టోర్నీ ఆద్యంతం రాణించిన హర్మన్‌ప్రీత్ సింగ్ (7 గోల్స్)కు 'హీరో ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు దక్కింది.

### ఏసీటీలో భారత్ ఆధిపత్యం

2011లో ప్రారంభించిన ఈ టోర్నీ తొలి ఎడిషన్లో విజేతగా నిలిచిన భారత్ 2012లో రన్నరప్తో సరిపెట్టుకుంది. ఆ తర్వాత 2016, 2018లో బ్యాక్ టు బ్యాక్ టైటిల్స్ గెలిచింది. 2023, 2024లోనూ అదే ఫలితాన్ని పునరావృతం చేసింది.

# వుమెన్స్ క్రికెటర్లకు ఐసీసీ గుడ్‌న్యూస్

ప్రపంచకప్ ప్రైజ్ మనీ విషయంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి మంగళవారం కీలక నిర్ణయం తీసుకున్నది. వచ్చే నెలలో యూఏఈ వేదికగా జరిగిన 20టీ వుమెన్స్ ప్రపంచకప్ జరుగనున్నది. ఈ క్రమంలో వుమెన్స్ క్రికెటర్లకు శుభవార్త చెప్పింది. ప్రపంచకప్లో మెన్స్ క్రికెటర్లతో సమానంగా వుమెన్స్ క్రికెటర్లకు సైతం ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్లు ఐసీసీ ప్రకటించింది. ఇకపై టీ20 టైటిల్‌ని నెగ్గిన జట్లు 23.40 లక్షల అమెరికన్ డాలర్లు ప్రైజ్‌మనీ దక్కనున్నది. అంటే భారతీయ కరెన్సీలో దాదాపు 19.60కోట్లు. గతేడాది దక్షిణాఫ్రికా వేదికగా జరిగిన వుమెన్స్ టి20 ప్రపంచకప్ నెగ్గిన జట్టుకు రూ.8.37కోట్ల ప్రైజ్‌మనీ దక్కింది. ఈ ఏడాది అమెరికా, వెస్టిండిస్ వేదికగా జరిగిన టీ20 వరల్డ్ కప్ గెలిచిన టీమిండియా మెన్స్ జట్టుకు రూ.23.40లక్షల అమెరిన్ డాలర్ల ప్రైజ్‌మనీ లభించిన విషయం తెలిసిందే. తాజాగా జరిగే వుమెన్స్ టీ20 విజేతకు సైతం అంతే మొత్తంలో ప్రైజ్‌మనీ దక్కబోతున్నది. గతేడాదితో పోలిస్తే ప్రైజ్‌మనీ 134శాతం పెరిగినట్లయ్యింది. ఐసీసీ జూలై 2023లో జరిగిన ఐసీసీ వార్షిక సమావేశంలో ప్రైజ్‌మనీపై నిర్ణయం తీసుకున్నది. ఐసీసీ తాజా నిర్ణయంతో క్రికెట్ వరల్ కప్లో మెన్స్, వుమెన్స్ జట్టుకు సమానంగా ప్రైజ్‌మనీ ఇచ్చే తొలి క్రీడగా క్రికెట్ నిలిచింది.



మహిళల టీ20 ప్రపంచకప్లో రన్నరప్‌గా నిలిచిన జట్టుకు ఇప్పుడు 1.7 మిలియన్ అమెరికన్ డాలర్లు అంటే రూ.14.24కోట్లు ఇవ్వనున్నారు. గతంలో రన్నరప్కు రూ.4.18కోట్లు దక్కేది. రన్నరప్ ప్రైజ్ మనీ సైతం 134 శాతం పెరగడం విశేషం. సెమీఫైనల్స్‌లో ఓడిన జట్లకు, గ్రూప్ దశలో నిష్క్రమించిన జట్లకు సైతం ప్రైజ్‌మనీని ఐసీసీ పెంచింది.

# ప్రత్యర్థి ఎవరైనా.. లక్ష్యం ఒక్కటే!



- కొత్త వ్యూహమేమీ లేదు
- బంగ్లాదేశ్‌తో సిరీస్‌పై కెప్టెన్ రోహిత్

చెన్నై: టెస్టు ఫార్మాట్లో ఇటీవలి బంగ్లాదేశ్ ప్రదర్శన కారణంగా తమ వ్యూహాలేమీ మారవని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తేల్చి చెప్పాడు. ఇటీవల పాక్‌తో జరిగిన రెండు టెస్టులను బంగ్లా క్లీన్‌స్వీప్ చేసిన విషయం తెలిసిందే. అలాగే ఆ జట్టు బౌలర్లు కూడా విశేషంగా రాణిస్తున్నారు. కానీ ఈ విషయంలో పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రోహిత్ భావిస్తున్నాడు. 'భారత్‌ను ఓడించాలని ప్రతీ జట్టు కోరుకుంటుంది. అలాగే భావించనీయండి. మా దృష్టంతా మ్యాచ్లను గెలవడంపైనే ఉంటుంది. ప్రతీ అగ్రశ్రేణి జట్టుతో మేం క్రికెట్ ఆడాం. కాబట్టి ఈసారి ప్రత్యేక ప్రణాళికలతో బరిలోకి దిగాల్సిన అవసరం లేదు. అలాగే ప్రత్యర్థి జట్ల బౌలర్ల గురించి ఆందోళన చెందాల్సిన పనీ లేదు. ఇద్దరు ముగ్గురు కొత్తవారు బంగ్లా జట్టులో ఉన్నారు. వారి పని వారిని చేసుకోనీయండి. మేం మా గేమ్స్‌లపై ఫోకస్ పెడతాం. ఇక ఊపిరి సలపని క్రికెట్ కారణంగా జట్టులోని ఉత్తమ బౌలర్లు ప్రతీ సిరీస్ లోనూ ఆడాలంటే కష్టం. అందుకే అప్పుడప్పుడు వారికి విశ్రాంతివ్వడం అవసరం.

అలాగే దేశవాళీల్లో యువ బౌలర్లు విశేషంగా రాణిస్తూ అవకాశం కోసం చూస్తున్నారు' అని రోహిత్ తెలిపాడు. మరోవైపు ఆసీస్‌తో సిరీస్ కోసం బంగ్లా మ్యాచ్‌లను సన్నాహకంగా తీసుకోవడం లేదని, డబ్ల్యూటీసీ పాయింట్లు గెలవాలంటే తమకు ప్రతీ మ్యాచ్ కీలకమేనని గుర్తు చేశాడు. ఇక తమ నెలన్నర రోజుల విరామంతో ఎలాంటి ఇబ్బందీ లేదన్నాడు. మరోవైపు కేఎల్ రాహుల్‌కు వరుస అవకాశాలిస్తామని స్పష్టం చేశాడు. అతను స్పిన్, పేసర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటాడని, అతడి ఉత్తమ ఆటతీరును వెలికితీయడమే తమ ఉద్దేశమని అన్నాడు.

### నల్లమట్టి పిచ్‌పై..

భారత్, బంగ్లాదేశ్ ఆటగాళ్లు మంగళవారం నల్లమట్టి పిచ్‌పై ప్రాక్టీస్‌ను కొనసాగించారు. తొలి టెస్టును మాత్రం ఎర్రమట్టితో తయారుచేసిన పిచ్‌పై నిర్వహించనున్నారు. ఇది ఆరంభంలో పేసర్లకు సహాయకంగా ఉంటుంది. అయితే ప్రస్తుతం చెన్నైలో వేడి అధికంగా ఉంటోంది. దీంతో మ్యాచ్ సాగుతున్నకొద్దీ పిచ్ తన సహజ స్వభావాన్ని కోల్పోయి స్పిన్‌కు అనుకూలించే అవకాశముందని వెటరన్ క్యూరేటర్ ఒకరు తెలిపాడు. అందుకే ఇరు జట్ల బ్యాటర్లు నల్లమట్టి పిచ్‌పైనా సాధన చేస్తున్నారు. శ్రీలంకతో ఇటీవల జరిగిన వన్డే సిరీస్లో శుభ్మన్ గిల్, రిషభ్ పంత్, విరాట్ కోహ్లి స్పిన్నర్లను సరిగా ఎదుర్కోలేకపోయారు.



# ఆలోచించి అడుగు వేయండి

జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్ మలయాళ సినీరంగాన్ని కుదిపేస్తున్నది. ఈ కమిటీ ప్రభావంతో ఇతర భాషల్లో కూడా లైంగిక వేధింపులపై విచారణ చేపట్టాలనే డిమాండ్‌లు పెరుగుతున్నాయి. డ్యాన్స్ మాస్టర్ జానీపై లైంగిక వేధింపుల కేసు నమోదు కావడం తెలుగు ఇండస్ట్రీలో సంచలనంగా మారింది. సినీ రంగంలో ఈ పరిణామాలపై కథానాయిక కృతిశెట్టి ఆందోళన వ్యక్తం చేసింది. ఆమె మాట్లాడుతూ 'ఈ తరహా సంఘటనలు జరగడం దురదృష్టకరం. బాధితులు అనుభవించిన మానసిక క్షోభను తలచుకుంటే భయమేస్తున్నది. అయితే ఇలాంటి సంఘటనల గురించి ఇండస్ట్రీలోకి కొత్తగా వచ్చేవారు ముందే తెలుసుకోవడం చాలా మంచిది. అప్పుడు వారికి ఇండస్ట్రీ పట్ల ఓ అవగాహన ఏర్పడుతుంది. దీనివల్ల భవిష్యత్తులో సానుకూల మార్పులు వస్తాయి' అని చెప్పింది. వ్యక్తిగతంగా ఇలాంటి విషయాలు తనను బాగా డిస్టర్బ్ చేస్తాయని, వేధింపుల వార్తలు విన్నప్పుడు ఆందోళన కలుగుతుందని కృతి శెట్టి చెప్పింది. ఇండస్ట్రీలోకి కొత్తగా వచ్చే మహిళలు ఆలోచించి అడుగులు వేయాలని ఆమె సలహా ఇచ్చింది. కృతిశెట్టి నటించిన తాజా చిత్రం 'ఏఆర్ఎమ్' బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధిస్తున్నది.

# బాధితురాలికి అండగా ఉంటాం

'పని ప్రదేశాల్లో వేధింపులు ఉన్నాయం టూ బాధితురాలు ఛాంబర్ని ఆశ్రయించింది. మీడియాలో విషయం వెలుగుచూడగానే, లైంగిక వేధింపుల గురించి బయటపెట్టింది. మా పరిధిలో మేం విచారణ పూర్తి చేశాం. ఇద్దరి వాదనలు విన్నాం. 90రోజుల్లో దీనికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని రిపోర్ట్ చేస్తాం. ఇలాంటి వ్యవహారాలపై పరిశ్రమకు చెందిన ఎవరు కైంప్లెంట్ చేసినా.. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం' అని టాలీవుడ్‌కి చెందిన లైంగిక వేధింపుల పరిష్కార ప్యానల్ అధ్యక్షురాలు ఝూన్సీ తెలిపారు. ప్రముఖ కొరియోగ్రఫర్ జానీ మాస్టర్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదైన విషయం విదితమే. ప్రస్తుతం నార్సింగ్ పోలీసులు ఈ కేసును విచారిస్తున్నారు. ఈ వ్యవహారంపై టాలీవుడ్‌కు చెందిన లైంగిక వేధింపుల పరిష్కార ప్యానెల్ మంగళవారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఝూన్సీ మాట్లాడుతూ 'బాధితురాలు పని ప్రదేశాల్లో లైంగిక వేధిపులకు ఎదుర్కొన్నానని పేర్కొన్నది. ఈ ఒక్క విషయాన్నే కాకుండా, ఈ వ్యవహారంలో మరికొన్ని అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అందుకు వైద్యపరంగా, న్యాయపరంగా ఆ అమ్మాయి సహకరించాలి.



ఆ అమ్మాయికి అండగా నిలవడానికి మా కమిటీ సిద్ధంగా ఉంది. అంతేకాదు, 'భూమిక హెల్ప్‌లైన్' అనే ఎన్జీవో సంస్థ కూడా ఆమెకు సపోర్ట్‌గా నిలిచింది' అని ఝూన్సీ చెప్పారు. సినీపరిశ్రమలో మహిళల క్షేమానికి ఢోకాలేదని తెలియజేసేందుకే ఈ ప్రెస్మీట్ పెట్టామని, 90రోజుల్లో దీనికి పరిష్కారం ఆలోచించి, మీడియాకు వివరిస్తామని ప్యానెల్ సభ్యుడు తమ్మారెడ్డి భరద్వాజ తెలిపారు. హైదరాబాద్ తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫీస్ వద్ద ఉదయం 6గంటల నుంచి రాత్రి 8గంటల వరకూ కంప్లయింట్ బాక్స్ అందుబాటులో ఉంటుందని, లైంగిక వేధింపులు ఎదుర్కొన్న వారు ఈ బాక్స్ ద్వారా తమ సమస్యను తెలియజేయవచ్చునని విజ్ఞప్తి చేస్తూ తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఈ సందర్భంగా ఓ ప్రకటన విడుదల చేసింది.

## ఈ ఏడాదంతా ప్రీప్రొడక్షనే

మహేశ్‌బాబు, రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న చిత్రం అప్డేట్ కోసం దేశం మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తున్నది. కానీ రాజమౌళి మాత్రం అవేం పట్టించుకోకుండా కామ్‌గా తన పనితాను చేసుకుంటూ పోతున్నారు. ఈ సినిమా ప్రీప్రొడక్షన్ పనులు గప్‌చుప్‌గా జరిగిపోతున్నాయట. ఫిల్మ్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం రాజమౌళి ఈ ఏడాది మొత్తాన్నీ ప్రీప్రొడక్షన్ వర్క్‌కే కేటాయిస్తున్నారట. ఈ సినిమా షూటింగ్ మొదలయ్యేది వచ్చే ఏడాదే అని తెలుస్తున్నది. తొలి షెడ్యూల్ జర్మనీలో ఉండబోతున్నదట. ఈ షెడ్యూలలోనే కొందరు విదేశీ నటులు కూడా భాగం కానున్నారని వినికిడి. 18వ శతాబ్దానికి చెందిన పీరియాడికల్ ఎపిసోడ్ ఈ సినిమాలో హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. అమెజాన్ ఫారెస్ట్ నేపథ్యం అంతా ఆ ఎపిసోడ్‌లోనే ఉంటుందట. దీనికోసం రాజమౌళి ప్రత్యేకమైన స్కెచ్‌లు గీయిస్తున్నారని వినికిడి. అరుదైన గిరిజన జాతికి సంబంధించిన రిఫరెన్సులు ఈ సినిమాలో ఉంటాయట. త్వరలోనే వీటికి సంబంధించిన స్కెచ్‌లు, కాస్ట్యూమ్స్ ఫైనలైజ్ చేయనున్నారు.

# మల్టీస్టారర్ జీబ్రా




సత్యదేవ్, కన్నడ నటుడు డాలీ ధనంజయ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మల్టీస్టారర్ 'జీబ్రా'. 'లక్ ఫేవర్స్ ది బ్రేవ్' అనేది ఉపశీర్షిక. ఈశ్వర్ కార్తీక్ దర్శకుడు. ఎస్.ఎన్.రెడ్డి, ఎస్.పద్మజ, బాలసుందరం, దినేష్ సుందరం నిర్మాతలు. అక్టోబర్ 31న దీపావళి కానుకగా సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రధాన పాత్రలను పరిచయం చేస్తూ మంగళవారం మోషన్ పోస్టర్ని విడుదల చేశారు. ఈ పోస్టర్‌లోనే రిలీజ్ డేట్ని అనౌన్స్ చేశారు. సత్యరాజ్, సత్య అక్కల, జెన్నిఫర్ పిసినాటో, సునీల్, ప్రియా భవానీశంకర్, డాలీ ధనంజయ, సత్యదేవ్లను ఈ పోస్టర్ పరిచయం చేసింది. కాయిన్ తిప్పడం, కరెన్సీ నోట్లు, ఫై ఓవర్ బ్రిడ్జిపై నుంచి కారు దూకడం వంటి డైనమిక్ ఎలిమెంట్స్ ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నాయి. ఈ చిత్రానికి కెమెరా: సత్య పొన్మార్, సంగీతం: రవి బస్రూర్, సహనిర్మాత: ఎస్.శ్రీలక్ష్మిరెడ్డి, నిర్మాణం: పద్మజ ఫిలమ్స్ ప్రై.లిమిటెడ్, ఓల్డ్‌టౌన్ పిక్చర్స్.

# నాలుగోసారి దర్శకత్వం



స్వీయ దర్శకత్వంలో ధనుష్ నటించిన 'రాయన్' చిత్రం ఇటీవలే విడుదలై భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. నటుడిగా, దర్శకుడిగా ధనుష్ అద్భుతమైన ప్రతిభతో ప్రేక్షకుల్ని మెప్పించారు. ప్రస్తుతం ఆయన తమిళంలో వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇదిలావుండగా ధనుష్ మరోమారు మెగాఫోన్ పట్టబోతున్నారు. ఆయన దర్శకత్వంలో రూపొందబోతున్న నాలుగో చిత్రమిది కావడం విశేషం. నూతన నిర్మాణ సంస్థ డాన్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. మంగళవారం ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడింది. తనదైన శైలి యాక్షన్, ఎమోషనల్ అంశాలతో ధనుష్ అద్భుతమైన స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారని, దర్శకుడిగా ఆయనకు మరో విజయం ఖాయమని చిత్ర నిర్మాణ సంస్థ పేర్కొంది. ప్రస్తుతం ధనుష్ 'కుబేర' చిత్రంలో నటిస్తున్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నాగార్జున, రష్మిక మందన్న ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో త్వరలో విడుదల కానుంది.

Printed and Published by **VUPPARI RAMESH KUMAR** on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No: 3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidu pet, Guntur (District), AP-522002. **EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.**